మీ సమస్యను
మీడియాకు చెప్పాలని ఉందా?

M.V.S.G.TILAK M.Sc., B.Ed.
Uttarandra Regional Bureau Chief
MANAM daily paper AP & TG
journalist.tilak03@gmail.com
Whatsapp : 9494524365
Please send ur news items,
we will publish it on our platform.
manamepaper.com

సంప్రదించండి



మనం
జనం కోసం అక్షర యజ్ఞం...

ఉమ్మడి
ఉత్తరాంధ్ర జిల్లాలు

శనివారం | 09 | మే | 2026 | పేజీలు : 12



2వ పేజీలో

# ప్రణాళికాబద్ధంగా ప్రాజెక్టులు

**- కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేయాలి**
**- కలెక్టర్ అభిషిక్త్ కిశోర్‌కు సీఎం సూచన**
**- నిర్దేశిత గడువులోగా ఐటీ కంపెనీలు గ్రౌండింగ్ అయ్యేలా చూడాలి**
**- టీటీడీ తరహాలో సింహాచలంలో గంజాయి నియంత్రణపై దృష్టిసారించాలని పోలీస్ కమిషనర్‌కు ఆదేశం**
**- మహిళలకు భద్రత కలిగిన నగరంగా వచ్చిన పేరును నిలపండి**
**- హాస్టళ్లలో పారిశుధ్యానికి థర్డ్ పార్టీ**
**- వాట్సాప్ గవర్నెన్స్‌లో జిల్లా పదో స్థానం**

**విశాఖపట్నం , మే 08 ( మనం న్యూస్ ) :** విశాఖపట్నం జిల్లా అధికారులు కేంద్ర ప్రభుత్వ నిధులు సద్వినియోగం చేసుకొని సకాలంలో పనులు పూర్తిచేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సూచించారు. అమరావతిలోని సచివాలయంలో నిర్వహిస్తున్న కలెక్టర్ల సదస్సులో రెండో రోజు ఆయన శుక్రవారం జిల్లాల వారీగా పనితీరును విశ్లేషించారు. ఏ అంశంలో మెరుగ్గా ఉన్నారు , ఎక్కడ ఇంకా అభివృద్ధి సాధించాలనే దానిపై మార్గదర్శనం చేశారు. సమావేశంలో కలెక్టర్ అభిషిక్త్ కిశోర్‌ను ఉద్దేశించి సీఎం మాట్లాడుతూ విశాఖపట్నం ఎకనామిక్ రీజియన్‌లో కేంద్ర ప్రభుత్వం సూచించిన అర్బన్, టూరిజం ప్రాజెక్టులను ప్రణాళికాబద్ధంగా ముందుకు తీసుకువెళ్లాలని సూచించారు. ఐటీ ప్రాజెక్టులన్నీ నిర్దేశిత గడువులోగా గ్రౌండింగ్ అయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం వైకుంఠ ఏకాదశి నాడు ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేసిందని, అక్కడ ఎన్ఆర్ఐలు రూపొందించిన ఏఐ సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించారని, దానివల్ల మంచి ఫలితాలు వచ్చినందున, ఆ మోడల్‌ను సింహాచలంలో ఉపయోగించాలని సీఎం సూచించారు. చందనోత్సవం, సింహగిరి ప్రదక్షిణ వంటి సమయాల్లో బాగా ఉపయోగపడుతుందన్నారు. విశాఖ జిల్లాలో వర్కింగ్ విమెన్స్ హాస్టళ్లు, యూనిటీ మాల్ నిర్మాణానికి కేంద్రం నిధులు అందుబాటులో ఉన్నాయని, సద్వినియోగం చేయాలన్నారు. శాంతి భద్రతలకు సంబంధించిన అంశాల్లో మాట్లాడుతూ, విశాఖలో గంజాయి సర్క్యులేషన్ తగ్గలేదని, దానిపై దృష్టి సారించాలని పోలీస్ కమిషనర్‌కు సూచించారు. ప్రజల స్పందన తెలుసుకున్నప్పుడు విశాఖలో మహిళలపై హింస పెరుగుతున్నదనే అభిప్రాయాలు వచ్చాయని,

# దేవరాపల్లి మండల రైతులకు 44 యంత్రాలు, రూ.15.59 లక్షల సబ్సిడీ

**మండల వ్యవసాయ అధికారిణి ఎల్.వై.కాంతమ్మ**



**దేవరాపల్లి , మే 08 ( మనం న్యూస్ ) :** 2025-26 సంవత్సరానికి 'సబ్ మిషన్ ఆన్ అగ్రికల్చరల్ మెకనైజేషన్' ( ఎస్ ఎం ఏం ) పథకాన్ని దేవరాపల్లి మండలంలో అమలు చేస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారిణి ఎల్.వై.కాంతమ్మ తెలిపారు. ఈ పథకం కింద మండల రైతులకు మొత్తం 44 వ్యవసాయ యంత్రాలకు రూ. 15.59 లక్షల సబ్సిడీ మంజూరైందని వెల్లడించారు.

ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు రైతులు, మహిళలకు 50%, ఇతరులకు 40% సబ్సిడీతో యంత్రాలు అందజేస్తామన్నారు. మంజూరైన యంత్రాల్లో 40 హెచ్.పీ ట్రాక్టర్-1, పవర్ టిల్లర్లు-2, పవర్ వీడర్లు-3, స్ప్రేయర్లు-30, సీడ్ కం ఫర్టిలైజర్ డ్రిల్-1, రోటవేటర్లు-5, నూర్పిడి/మేత యంత్రాలు-2 ఉన్నాయి. అర్హతలు: పట్టా భూమి ఉన్న రైతులు, రోఫర్ పట్టాదారులు, గత 3 ఏళ్లలో కౌలు కార్డు పొందిన కౌలు రైతులు అర్హులు. ఒక కుటుంబం నుంచి ఒక్కరే దరఖాస్తు చేసుకోవాలి. 2024-25లో సబ్సిడీ పొందిన వారు అనర్హులు. దరఖాస్తు: గ్రామ రైతు సేవ కేంద్రం ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. చివరి తేదీ ఈ నెల 19వ తేదీ అర్ధ రాత్రి. లబ్ధిదారులను జాయింట్ కలెక్టర్, అనకాపల్లి సమక్షంలో లాటరీ ద్వారా ఎంపిక చేస్తారు. ఎంపికైన వారికి ఎస్ఎంఎస్ ద్వారా సమాచారం అందుతుంది. మంజూరు పత్రం వచ్చిన 15 రోజుల్లో రైతు వాటా చెల్లించి, 30 రోజుల్లో యంత్రం డెలివరీ పొందవచ్చు. రైతులు వెంటనే తమ గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని అధికారిణి కోరారు.



2వ పేజీలో

# 21 నుంచి ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ

# యువకుడి ఆత్మహత్య



**విశాఖ క్రైమ్ , మే 08 ( మనం న్యూస్ ) :** విశాఖపట్నంలోని పెదవాల్తేరు ప్రాంతంలో విషాద ఘటన చోటుచేసుకుంది. ప్రధాన రహదారి పక్కనే ఉన్న ఓ భవనంపై నుంచి యువకుడు కిందికి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. యువకుడు ఎత్తైన భవనం పై నుంచి దూకడంతో ఘటనాస్థలం రక్తసిక్తమైంది. ఈ ఘటనను గమనించిన స్థానికులు వెంటనే మూడవ టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. మృతి చెందిన యువకుడి వివరాలు ఇంకా తెలియరాలేదు. అయితే అతనికి మతిస్థిమితం సరిగా లేదని స్థానికులు చెబుతున్నారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# ప్రణాళికాబద్ధంగా ప్రాజెక్టులు

ఒకటి తరువాయి

వాటిపై దృష్టి సారించాలన్నారు. మహిళలకు భద్రత కలిగిన నగరంగా విశాఖ సాధించిన పేరును నిలపాలన్నారు. పథకాల అమలులో విశాఖపట్నం జిల్లా రెండో స్థానంలో నిలిచింది. గత సమావేశం నాటికి ప్రజల సానుకూలత 72.7 శాతం ఉండగా ఇప్పుడు అది 76.6 శాతానికి చేరింది. అయితే పారిశుధ్యం గతం కంటే ఇప్పుడు తగ్గిపోయిందని, వీధి దీపాలు, మంచినీటి సరఫరా తగినంతగా లేవనే అభిప్రాయాలు వచ్చాయి. సాంఘిక సంక్షేమ హాస్టళ్ల నిర్వహణపై కూడా సానుకూల అభిప్రాయం గతం కంటే తగ్గింది. రెవెన్యూ సర్వే సక్రమంగా సాగడం లేదనే ఫీడ్ బ్యాక్ వచ్చింది. కాలుష్యం గతం కంటే కొంత మెరుగైందనే అభిప్రాయం వచ్చింది. వాట్సాప్ గవర్నెన్స్‌లో జిల్లా పదో స్థానంలో ఉంది. పీజీఆర్ఎస్‌లో కలెక్టర్ కార్యాలయానికి ఈ ఏడాది జనవరి నుంచి మే 4వ తేదీ వరకు 5,413 అర్జీలు రాగా వాటిలో 1,725 తిరస్కరించారు. మరో 3,668 దరఖాస్తులను రీడ్రెసల్‌కు పంపించారు. బీసీలకు సంబంధించి ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసినందున, వారికి సంబంధించిన వివరాలను కమిటీకి అందేలా తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. హాస్టళ్లలో పారిశుధ్యం నిర్వహణకు థర్డ్ పార్టీని పెట్టుకోవాలని, వంటగది పరిశుభ్రంగా ఉంచే బాధ్యత కుకింగ్ సిబ్బందికి అప్పగించాలని, వాతావరణం బాగుండేలా చూడాలని సీఎం ఆదేశించారు. శ్మశానాలకు తగిన భూములు కేటాయించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న 76 పోస్టులను మే నెలాఖరుకు భర్తీచేయాలని సూచించారు. విశాఖ జిల్లాలో 22-ఏకి సంబంధించి 396 దరఖాస్తులు రాగా వాటిలో 49 పరిష్కరించి, 101 తిరస్కరించారు. మిగిలినవి వేర్వేరు దశల్లో ఉన్నాయి.

# ఐటీ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్

- జపాన్ కంపెనీ నిప్పన్ కోయి సహాయం
- మూడు నెలల్లో పూర్తి ప్రణాళిక సిద్ధం
- డేటా సెంటర్లు, ఐటీ కంపెనీలు, జీసీసీలు రాక నేపథ్యంలో మౌలిక వసతులపై దృష్టి
- కమర్షియల్ జోన్లు, రెసిడెన్షియల్ ఏరియాలు గుర్తింపు



**విశాఖపట్నం , మే 08 ( మనం న్యూస్ ) :** విశాఖపట్నంలో ఐటీ రంగం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా మాస్టర్‌ప్లాన్ రూపొందిస్తోంది. దీనికి జపాన్ కంపెనీ నిప్పన్ కోయి సహాయం తీసుకుంటోంది. జిల్లాలో ఒక గిగావాట్ డేటా సెంటర్ ఏర్పాటుకు గూగుల్ ముందుకురావడం, దానికి శరవేగంతో శంకుస్థాపన కూడా జరగడంతో అనేక ఐటీ కంపెనీలు విశాఖపట్నం రావడానికి ఆసక్తి చూపుతున్నాయి. గూగుల్‌కు ముందు అదానీ, సిఫీ డేటా సెంటర్లు శంకుస్థాపనలు చేసుకున్నాయి. టీసీఎస్, రిలయన్స్ తదితర సంస్థలు కూడా డేటా సెంటర్ల ఏర్పాటుకు సిద్ధమవుతున్నాయి. ఈ డేటా సెంటర్లకు అవసరమైన మౌలిక వసతుల కల్పన కీలకంగా మారింది. డేటా సెంటర్లకు పెద్దఎత్తున నీరు, విద్యుత్, డిజిటల్ టెక్నాలజీ, తదితరాలు అవసరం. వాటిని సమకూర్చాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే ఉంది. డేటా సెంటర్లతో పాటు అనేక గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు (జీసీసీ) విశాఖపట్నం వస్తున్నాయి. అదేవిధంగా కాగ్నిజెంట్, ఇన్ఫోసిస్, టీసీఎస్‌లకు ఇప్పటికే భూములు కేటాయించగా, మరికొన్ని ఐటీ కంపెనీలు కూడా విశాఖలో సెంటర్లు ఏర్పాటుచేస్తామని భూములు కోరుతున్నాయి. ఈ కొత్త కంపెనీల ఆర్థిక అవసరాలు తీర్చడానికి బ్యాంకులు, ఫైనాన్షియల్ సంస్థలు కార్యాలయాల ఏర్పాటుచేస్తామని భూములు కావాలని ప్రభుత్వాన్ని సంప్రదిస్తున్నాయి. ఈ నేపథ్యంలో విశాఖపట్నం కేంద్రంగా నీతిఆయోగ్ ప్రతిపాదించిన ఎకనామిక్ రీజియన్‌లో భాగంగా ఐటీ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ తయారీకి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇప్పటికే రుషికొండ, మధురవాడ, కాపులుప్పాడ, ఆనందపురం తదితర ప్రాంతాల్లో ఐటీ, డేటా సెంటర్లకు భూములు కేటాయించినందున ఆయా ప్రాంతాల్లో ఏది ఎక్కడ?..ఉండాలనే దానిపై మాస్టర్ ప్లాన్ నిర్దేశిస్తుంది. డేటా సెంటర్లు ఒక ప్రాంతంలో, జీసీసీలు మరో ప్రాంతంలో, ఐటీ కంపెనీలు ఇంకోచోట ఉంటాయి. వాటికి అవసరమైన రహదారుల నిర్మాణం, వాణిజ్య కార్యకలాపాలకు అవసరమైన కమర్షియల్ జోన్లు, రెసిడెన్షియల్ ఏరియాలు గుర్తిస్తారు. పూర్తిస్థాయిలో ఐటీ మాస్టర్‌ప్లాన్ తయారీకి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోంది.

**యారాడలో ఐటీ హబ్‌కు ఎమ్మెల్యే ప్రతిపాదన**

విజయవాడలో జరిగిన ఎమ్మెల్యేలు, కలెక్టర్ల సమావేశంలోను విశాఖపట్నం ఐటీ కంపెనీల అంశం చర్చకు వచ్చింది. జిల్లా ఎమ్మెల్యేలతో సీఎం చంద్రబాబునాయుడు రెండు రోజుల క్రితం సమావేశం నిర్వహించినప్పుడు గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ప్రముఖ పర్యాటక కేంద్రమైన యారాడలో 400 ఎకరాల భూమి అందుబాటులో ఉందని, మ్యాప్‌లతో సహా సీఎంకు చూపించారు. పక్కనే సముద్రం ఉండడం వల్ల చాలా బాగుంటుందని ఐటీ హబ్‌గా అభివృద్ధి చేయాలని కోరారు. విశాఖలో ఐటీ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ తయారుచేస్తున్నామని, అందులో అన్నీ ఉంటాయని సీఎం సమాధానమిచ్చారు. తాజాగా శుక్రవారం జరిగిన కలెక్టర్ల సమావేశంలోను విశాఖ ఐటీపై చర్చ జరగ్గా, ఐటీ కార్యదర్శి కాటమనేని భాస్కర్ మాట్లాడుతూ, విశాఖతో పాటు అమరావతి, తిరుపతి నగరాలకు కూడా ఐటీ మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్నామని చెప్పారు. మరో మూడు నెలలు తరువాత జరిగే కలెక్టర్ల సమావేశానికి ఆ ప్లాన్ సిద్ధమవుతుందన్నారు. దాని ప్రకారమే భూముల కేటాయింపు, ఇతర సౌకర్యాల కల్పన వంటివి అమలవుతాయన్నారు. ఈ నేపథ్యంలో విశాఖ అభివృద్ధికి మరో మాస్టర్‌ప్లాన్ రానుంది.

# 21 నుంచి ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ

- పరీక్షల నిర్వహణకు జిల్లాలో 60 కేంద్రాలు
- హాజరుకానున్న 45,554 మంది విద్యార్థులు

**మద్దిలపాలెం , మే 08 ( మనం న్యూస్ ) :** జిల్లాలో ఈనెల 21 నుంచి నిర్వహించనున్న ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఎనిమిది జోన్‌లలో 60 కేంద్రాల్లో ఈ పరీక్షలు నిర్వహించనున్నారు. మొత్తం 51 ప్రైవేటు, నాలుగు ప్రభుత్వ, ఒక సోషల్ వెల్ఫేర్, ఒక ట్రైబల్ వెల్ఫేర్, ఒక ఎయిడెడ్ కళాశాలల్లో కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాల్లో సీసీ కెమెరాలు అమర్చారు. మూడేసి ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్‌లను నియమించారు. సప్లిమెంటరీ పరీక్షలకు జిల్లావ్యాప్తంగా 45,554 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. వీరిలో ప్రథమ సంవత్సరం విద్యార్థులు 28,361, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 17,193 మంది ఉన్నారు. ఈనెల 21 నుంచి జూన్ 2 వరకు ప్రతిరోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రథమ సంవత్సరం, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ద్వితీయ సంవత్సరం పరీక్షలు జరుగుతాయి. జూన్ 5న నీతి, మానవ విలువలు, 6న పర్యావరణం పరీక్ష నిర్వహిస్తారు. ప్రశ్నపత్రాలను భద్రపరిచేందుకు 14 స్టోరేజ్ పాయింట్‌లను ఏర్పాటుచేశారు. ఈ ఏడాది ప్రథమ సంవత్సరం పరీక్షలకు 38,392 మంది విద్యార్థులు హాజరవగా 6,058 మంది ఫెయిల్ అయ్యారు. కానీ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీకి 28,361 ఫీజు చెల్లించారు. అంటే 22,303 మంది బెటర్‌మెంట్ రాసేందుకు సిద్ధమవుతున్నారు. అలాగే ద్వితీయ సంవత్సరంలో ఫెయిలైనవారు 5,869 మంది మాత్రమే కాగా బెటర్‌మెంట్‌కు 11,324 మంది ఫీజులు చెల్లించడం విశేషం. ఎంసెట్, నీట్, జేఈఈ ర్యాంకుల్లో ఇంటర్ మార్కులకు వెయిటేజీ ఉండడంతో సైన్స్ గ్రూపు సబ్జెక్టుల విద్యార్థులు మార్కులు పెంచుకునేందుకు వీలుగా ఈ ఏడాది బెటర్‌మెంట్ రాసేందుకు సిద్ధమవుతున్నారు. జిల్లాలో ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఇంటర్మీడియట్ బోర్డు, జీవీఎంసీ, వైద్య ఆరోగ్యశాఖ, ఆర్టీసీ, విద్యుత్ శాఖాధికారులతో ఆమె సమావేశమై స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. పరీక్షల నిర్వహణలో లోటుపాట్లు లేకుండా సంబంధిత శాఖలన్నీ సమన్వయంతో పనిచేయాలన్నారు. విద్యుత్ సరఫరా, తాగునీరు, మరుగుదొడ్లు, ఫర్నిచర్, మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతి లేదన్నారు. పరీక్షల సమయంలో కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలుచేయాలని, కేంద్రాల నుంచి 200 మీటర్ల పరిధిలో జెరాక్స్ దుకాణాలు మూసివేయించాలని ఆదేశించారు. కేంద్రాల వద్ద ప్రథమ చికిత్స సదుపాయాలు, విద్యార్థులు కేంద్రాలకు చేరుకోవడానికి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

# 'శాంక్టమ్' తొలగింపుపై స్టే..ఏపీటీడీసీకి సుప్రీంకోర్టులో ఊరట

**విశాఖపట్నం , మే 08 ( మనం న్యూస్ ) :** ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ)కు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. తొట్లకొండలో కోస్తా నియంత్రణ మండలి (సీఆర్‌జెడ్) నిబంధనలు ఉల్లంఘించి శాంక్టమ్ రెస్టారెంట్ పేరుతో చేపట్టిన నిర్మాణాలన్నింటినీ కూల్చేయాలని గత నెల 23న హైకోర్టు తీర్పు ఇచ్చిన సంగతి తెలిసిందే. కాపులుప్పాడ సర్వే నంబర్ 314లోని 2.4 ఎకరాల విస్తీర్ణంలో ఏపీటీడీసీ రెస్టారెంట్ నిర్మించి లీజుకు ఇచ్చింది. దానిని ఆ వ్యక్తి వైసీపీ నాయకులకు సబ్ లీజుకు ఇచ్చారు. వారు అధికారంలో ఉన్నప్పుడు సీఆర్‌జెడ్ నిబంధనలు ఉల్లంఘించి ఇష్టానుసారం పక్కా నిర్మాణాలు చేపట్టారు. అనుమతులు తీసుకోలేదు. దీనిపై విశాఖపట్నం ఫిషర్ విమెన్ డ్రై ఫిష్ కో-ఆపరేటివ్ సొసైటీ హైకోర్టులో కేసు వేసింది. ఆ తరువాత అక్కడ అక్రమాలు కూడా జరుగుతున్నాయని జనసేన నాయకుడు పీతల మూర్తి యాదవ్ కేసు వేశారు. అనధికార నిర్మాణాలు తొలగించాలని జీవీఎంసీ అధికారులు సూచించారు. అయితే ఏపీటీడీసీ ప్రభుత్వ కార్పొరేషన్ అని, నిబంధనలకు తమకు వర్తించవని హైకోర్టులో అధికారులు వాదించారు. దానిపై న్యాయస్థానం సీరియస్ అయింది. చట్టం ముందు అంతా సమానమేనని, అక్రమ నిర్మాణాలను ఉత్తర్వులు అందిన మూడు వారాల్లో తొలగించాలంటూ గత నెల 23న తీర్పు ఇచ్చింది. ఇది ఏపీటీడీసీకి మింగుడు పడలేదు. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ, నిర్మాణాలను తొలగించకుండా స్టే ఇవ్వాలని సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అక్కడ కేసును స్వీకరిస్తూ, వచ్చే విచారణ వరకు నిర్మాణాలను తొలగించవద్దని పేర్కొంటూ స్టే ఇచ్చినట్టు ఏపీటీడీసీ వర్గాలు శుక్రవారం తెలిపాయి.

## కౌమార దశలో రక్తహీనత నివారణకు పోషకాహారం అవసరం



చింతపల్లి , మే 08 ( మనం న్యూస్ ) : కౌమార దశలో ఉన్న బాలబాలికలు రక్తహీనత బారిన పడకుండా పోషకాహారం తీసుకోవడంతో పాటు పరిశుభ్రత పాటించాలని సీడీపీఓ శ్రీదేవి తెలిపారు. వేసవి సెలవుల శిక్షణా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం చౌడుపల్లి, లంబసింగి అంగన్వాడీ కేంద్రాల్లో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. 11 నుంచి 18 సంవత్సరాల మధ్య వయస్సు గల బాలబాలికల్లో అలసట, బలహీనత, పని చేయాలన్న ఆసక్తి లేకపోవడం, నాలుక పాలిపోయినట్లు కనిపించడం వంటి లక్షణాలు రక్తహీనతకు సంకేతాలని వివరించారు. రక్తహీనత నివారణకు ప్రతి ఆరు నెలలకు ఒకసారి నులిపురుగుల మందులు వేసుకోవాలని, ఆకుకూరలు, కూరగాయలు, గుడ్లు, పాలు, మాంసం, సి-విటమిన్ అధికంగా ఉన్న పండ్లు ఆహారంలో భాగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ సూపర్వైజర్ ఎస్.గౌరీ, డి.జైభారతి, ఎం.లక్ష్మి, అంగన్వాడీ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది, కిశోర బాలురు, బాలికలు పాల్గొన్నారు.

## కేపిఎల్ క్రికెట్ టోర్నీ ప్రారంభం



తగరపువలస , మే 08 ( మనం న్యూస్ ) : నియోజకవర్గం వైఎస్సార్ సీపీ మహిళా అధ్యక్షురాలు డబ్బీరు ప్రశాంతి పట్నాయక్ సోదరుడు బెహరా వెంకట సూర్య కుమార్ జ్ఞాపకార్థం తగరపువలస బంతాట మైదానంలో శుక్రవారం కేపిఎల్ క్రికెట్ టోర్నీ ప్రారంభం అయింది. ఈ టోర్నీ ని ప్రశాంతి పట్నాయక్ స్వంత నిధులతో ఏర్పాటు చేసారు. అనంతరం ప్రశాంతి పట్నాయక్ మాట్లాడుతూ తన సోదరుడుకి క్రీడలపై మక్కువ ఎక్కువ అని, మంచి సెటిల్ క్రీడాకారుడు గా పేరు సంపాదించుకున్నారని అన్నారు. ఆయన జ్ఞాపకార్థం ఈ టోర్నీ నిర్వహించడం చాలా సంతోషంగా ఉంది అని, ఆటలో గెలుపు ఓటములు సహజ మని, గెలుపు మరో గెలుపు కు స్ఫూర్తి అయితే ఓటమి రాబోయే గెలుపు కు నాంది అన్నారు. ఈ టోర్నీ లో 5 టీమ్ లు పాల్గొం టాయని, ఆదివారం ముగిం పు రోజు విజేతలకు ముఖ్య అతిథి చేతులు మీదుగా బహుమ తులు అందజేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమం లో ముఖ్య అతిధులు గా 2వ వార్డు వైసిపి పార్టీ అధ్యక్షులు చిల్ల బాస్కర్ రెడ్డి, బింగి హరి కిరణ్ రెడ్డి, అక్కరమాని రామానాయుడు, జీరు వెంకట రెడ్డి పాల్గొన్నారు.

## అధిక లోడుతో వెళ్తున్న లారీకి పోలీసులు ఫైన్

అచ్యుతాపురం , మే 08 ( మనం న్యూస్ ) : మండలంలోని శుక్రవారం పోలీసుల తనిఖీల్లో భాగంగా అధిక లోడుతో వెళ్తున్న లారీని పట్టుకుని 20035/- వేల రూపాయలు ఫైన్ విధించినట్లు అచ్యుతాపురం ఎస్ఐ సుధాకర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలు నిబంధనలకు విరుద్ధ ంగా అధిక లోడుతో ప్రయాణిస్తే చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరిం చారు. అలాగే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమ నిబంధ నలను పాటించి ప్రజలకు ఇబ్బందులు తలెత్త కుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి అన్నారు. ఇక్కడ ఉన్న రహదారులకు అనుగుణ ంగా రవాణా చేసుకోవాలని సూచించారు.




అలాకాకుం డా విరుద్ధంగా అధిక లోడు తో వాహనాలు ప్రయాణిస్తే వాహనాలను సీజ్ చేస్తామని ఎస్సై ఈ సందర్భంగా హెచ్చరించారు.

## పేదల భూములపై ఎమ్మెల్యే పంజా..మాడుగుల మట్టిని అమ్మేస్తారా ?

**- పరిశ్రమల పేరుతో పచ్చని పొలాల్లో కాలుష్యం చిమ్ముతారా?**
**- మూతపడిన షుగర్ ఫ్యాక్టరీని వదిలేసి, అసైన్డ్ భూములపై కన్నేయడమేంటి? : సిపిఎం నేత డి. వెంకన్న ఘాటు విమర్శలు**

మాడుగుల , మే 08 ( మనం న్యూస్ ) : మాడుగుల నియోజకవర్గంలో ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి సాగిస్తున్న భూ దందాలపై సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు డి. వెంకన్న నిప్పులు చెరిగారు. శుక్రవారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో ఎమ్మెల్యే వైఖరిని అత్యంత ఘాటుగా విమర్శించారు. నియోజకవర్గంలో పేదలు, గిరిజనులు ప్రాణప్రదంగా చూసుకునే అసైన్డ్ భూములను అప్పనంగా కాజేసి, రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయాలని చూడటం సిగ్గుచేటని మండిపడ్డారు.

**వందల ఎకరాల దోపిడీకి స్కెచ్!**

పరిశ్రమల పేరుతో ఎమ్మెల్యే చేస్తున్న మాయాజాలాన్ని వెంకన్న ఎండగట్టారు. దేవరాపల్లిలో అదానీ పేరుతో 820 ఎకరాలు, చీడికాడలో సోలార్ ప్లాంట్ పేరిట 262 ఎకరాలు, ఇక కె.కోటపాడులో ఞ్జుల ముసుగులో ఏకంగా 10,250 ఎకరాలను లాక్కోవాలని చూడటం గిరిజన ద్రోహమేనని ధ్వజమెత్తారు.



“గతంలో పరవాడను కాలుష్యమయం చేసి నాశనం చేసిన ఎమ్మెల్యే.. ఇప్పుడు పచ్చటి మాడుగుల పంట పొలాల్లో విషం నింపాలని చూస్తున్నారు” అని నిప్పులు చెరిగారు.

**రైతులను మోసం చేస్తే ఖబర్దార్!**

అర్లి పంచాయతీలో రైతులు తమ భూములు ఇవ్వమని తెగేసి చెప్పినా, ఎమ్మెల్యే తన అనుచరులను ఆర్డీవో వద్దకు పంపి తప్పుడు ప్రచారం చేయించడం ఆయన దిగజారుడు రాజకీయాలకు పరాకాష్ట అని విమర్శించారు. రైతుల అభీష్టానికి వ్యతిరేకంగా నోటీసులు ఇచ్చి భయభ్రాంతులకు గురిచేయడం అత్యంత దారుణమన్నారు.

**దమ్ముంటే షుగర్ ఫ్యాక్టరీని తెరిపించు!**

“ఎమ్మెల్యేకు నిజంగా అభివృద్ధిపై చిత్తశుద్ధి ఉంటే, ఈ ప్రాంత రైతుల జీవనాడి అయిన షుగర్ ఫ్యాక్టరీని ఎందుకు తెరిపించరు?” అని వెంకన్న సూటిగా ప్రశ్నించారు. వ్యవసాయాన్ని నాశనం చేసి, పారిశ్రామిక వేత్తల ప్రయోజనాల కోసం పేదల పొట్ట కొట్టాలని చూస్తే మాడుగుల ప్రజలు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు.

**ప్రజా ఉద్యమం తప్పదు!**

పేదలకు అండగా సిపిఎం నిలబడుతుందని, భూముల రక్షణ కోసం ఎంతటి పోరాటానికైనా సిద్ధమని వెంకన్న స్పష్టం చేశారు. ఎమ్మెల్యే తన భూ దాహాన్ని ఆపుకోకపోతే గిరిజన, ప్రజా ఉద్యమ సెగలు తగలక తప్పదని హెచ్చరించారు.

## వైసీపీకి భారీ షాక్
## జనసేనలోకి ఎం.కే.వల్లపురం నాయకులు

మాడుగుల , మే 08 ( మనం న్యూస్ ) : వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి మాడుగుల నియోజకవర్గంలో గట్టి ఎదురుదెబ్బ తగిలి ంది. జనసేన పార్టీ సిద్ధాంతాలు, ఆశయాల పట్ల ఆకర్షితులై ఎం.కే.వల్లపురం గ్రామానికి చెందిన కీలక నాయకులు భారీగా జనసేనలో చేరారు. శుక్రవారం పెందుర్తి నియోజకవర్గం సుజాతనగర్‌లోని క్యాంపు కార్యాలయంలో ఈ చేరికల కార్యక్రమం ఘనంగా జరిగింది. ఉమ్మడి విశాఖపట్నం రూరల్ జిల్లా అధ్యక్షుడు, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు సమక్షంలో, మాడుగుల జనసేన పార్టీ అధ్యక్షుడు గంట్రెడ్డి శివాజీ ఆధ్వర్యంలో ఎం.కే.వల్లపురం గ్రామ మాజీ ఉపసర్పంచ్ కరణం రాము జనసేన తీర్థం పుచ్చుకున్నారు. ఆయనతో పాటు అదే గ్రామానికి చెందిన మాజీ వార్డు మెంబర్లు, సుమారు 30 మంది వైసిపి కార్యకర్తలు జనసేన కండువా కప్పుకున్నారు. ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు కొత్తగా చేరిన నాయకులకు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..



జనసేన పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి స్థానిక నాయకులతో కలిసి సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

**పార్టీలో చేరిన వారు:**

అద్దిపల్లి మాలి బాబు, కాకర చిన్నబ్బాయి, కోట్ని సురేష్, కాకర నరేష్, పిచ్చెట్టి సతీష్, కోట్ని అరుణ్ కుమార్, కాకర కొండలరావు (ఎం.కే.వల్లపురం). అలాగే జాలంపల్లి పంచాయతీ నుండి వంతంగి గణేష్, బచ్చుల కృష్ణ, సిగ్గిలి అర్జున్ రావు తదితరులు జనసేనలో చేరారు.

**పాల్గొన్న ముఖ్య నేతలు:**

ఈ కార్యక్రమంలో మాడుగుల నియోజకవర్గ జనసేన ఇంచార్జ్ రాయపరెడ్డి కృష్ణ, మూర్తి, రామ్మూర్తి నాయుడు, ఎం.కే.వల్లపురం పీఏసీఎస్ అధ్యక్షుడు పిల్లా నాయుడు, జిల్లా కార్యదర్శి రబ్బా మహేష్, కోటపాడు గ్రామ కార్యదర్శి బుద్ద రెడ్డిల కన్నా నాయుడు, శ్రీను (మండల ప్రధాన కార్యదర్శి), ముర్రి ఈశ్వర్, హరి బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

## గ్రోత్ సమ్మిట్ 2026ను నిర్వహించిన వాల్‌మార్ట్




**విశాఖపట్నం , మే 08 ( మనం న్యూస్ ) :** వాల్‌మార్ట్ ఈరోజు భారత్ మండపంలో వాల్‌మార్ట్ గ్రోత్ సమ్మిట్ ఇండియా 2026 యొక్క రెండవ ఎడిషన్‌ను నిర్వహించింది. దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లలో వృద్ధి అవకాశాలను అన్వేషించడానికి ఈ కార్యక్రమంలో ఎగుమతికి సిద్ధంగా ఉన్న వ్యాపార సంస్థలు, ఎంఎస్ఎంఈలు, డిజిటల్-ఫస్ట్ బ్రాండ్‌లు, డి2సి విక్రేతలు , సరఫరా చైన్ భాగస్వాములు సమావేశమయ్యారు. 1990ల నుండి, భారతదేశ వ్యాప్తంగా బలమైన సరఫరాదారు భాగస్వామ్యాలను వాల్‌మార్ట్ నిర్మించుకుంది, ఇది దీర్ఘకాలిక ఎగుమతి సామర్థ్యాలను అభివృద్ధి చేయడంలో సహాయపడింది. దేశం ఒక కీలకమైన ప్రపంచ తయారీ కేంద్రంగా ఆవిర్భవించడానికి దోహదపడింది. భారతదేశం నుండి ఇప్పటికే 40 బిలియన్ డాలర్లకు పైగా విలువైన వస్తువులను సేకరించిన నేపథ్యంలో, భారతదేశ ఎగుమతి వ్యవస్థను బలోపేతం చేయడానికి , మరిన్ని వ్యాపారాలు ప్రపంచ మార్కెట్లకు చేరుకోవడానికి వీలు కల్పించడానికి వాల్‌మార్ట్ యొక్క నిరంతర నిబద్ధతను ఈ సదస్సు నొక్కి చెప్పింది. ఈ సందర్భంగా వాల్‌మార్ట్ మరియు ఫ్లిప్‌కార్ట్ అధినేతలు ప్రపంచ సరఫరా చైన్ లలో భారతీయ వ్యాపారాల పెరుగుతున్న పాత్రను, అలాగే స్థానిక భాగస్వామ్యాలను పెంపొందించటం, సామర్థ్య నిర్మాణ ప్రయత్నాలను మరింత బలోపేతం చేయవలసిన ఆవశ్యకతను నొక్కి చెప్పారు. భారత ప్రభుత్వ విదేశీ వాణిజ్య డైరెక్టరేట్ జనరల్ (డిజిఎఫ్ టి ) మరియు ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఎక్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్స్ (ఎఫ్ఐఈఓ) సహకారంతో జైపూర్ మరియు కోయంబత్తూర్‌లలో నిర్వహించిన ప్రాంతీయ గ్రోత్ సమ్మిట్ కార్యక్రమాల కొనసాగింపుగా ఈ సదస్సు జరిగింది. ఈ కార్యక్రమాలు కీలకమైన ఎంఎస్ఎంఈహా క్లస్టర్‌లలో విస్తరణను బలోపేతం చేయనున్నాయి , వచ్చే ఏడాది మరిన్ని ఇలాంటి సదస్సులను నిర్వహించనున్నారు . "ప్రపంచ వాణిజ్యంలో నేడు భారతదేశం అత్యంత చైతన్యవంతమైన, ఉత్తేజకరమైన అవకాశాలను అందించే మార్కెట్ లలో ఒకటిగా నిలుస్తోంది," అని వాల్‌మార్ట్ ఇంక్. ప్రెసిడెంట్ జాన్ ఫర్నర్ అన్నారు. "ఇప్పటివరకు భారతదేశం నుండి 40 బిలియన్ డాలర్లకు పైగా విలువైన వస్తువులను సేకరించడం నుండి, వాల్‌మార్ట్ వృద్ధి ద్వారా 1,15,000 మందికి పైగా పారిశ్రామికవేత్తల వృద్ధికి మద్దతు ఇవ్వడం వరకు, భారతీయ వ్యాపారాలు ఎగుమతికి సిద్ధంగా ఉండేలా చూసేందుకు మేము సరఫరాదారుల సామర్థ్యం, నిబంధనల పాటింపు, నాణ్యతా ప్రమాణాలు, మరియు తయారీ స్థాయి వంటి పూర్తి పర్యావరణ వ్యవస్థలో పెట్టుబడి పెట్టడంపై దృష్టి సారించామన్నారు. ఫ్లిప్‌కార్ట్ గ్రూప్ హెడ్ కళ్యాణ్ కృష్ణమూర్తి మాట్లాడుతూ, "ఫ్లిప్‌కార్ట్ గ్రూప్ వద్ద మేము, భారతదేశవ్యాప్తంగా ఉన్న లక్షలాది చిన్న వ్యాపారాలు, పారిశ్రామికవేత్తలు, కళాకారులు మరియు స్థానిక వర్గాలకు సాంకేతికత మరియు డిజిటల్ వాణిజ్యం ఎలా అవకాశాలను అందిస్తాయో ప్రత్యక్షంగా చూశాము. ఫ్లిప్‌కార్ట్ సమర్థ్ మరియు వాల్‌మార్ట్ వృద్ధి వంటి కార్యక్రమాల ద్వారా, మేము సామర్థ్యాలను పెంపొందించడానికి, మార్కెట్ అవకాశాలను మెరుగుపరచడానికి మరియు వ్యాపారాలు దేశీయంగా, ప్రపంచవ్యాప్తంగా ఎదగడానికి మార్గాలను సృష్టించడానికి సహాయం చేస్తున్నాము అని చెప్పారు.

## ఓవర్‌లోడ్ వాహనాలపై

# కఠిన చర్యలు : ఎస్ఐ ఎం.వెంకటరమణ

**చింతపల్లి , మే 08 ( మనం న్యూస్ ) :** అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మన్యం ప్రాంతంలో జీపులు, కార్లు, వ్యాన్లలో ఓవర్‌లోడ్ రవాణా పెరుగుతున్న నేపథ్యంలో రహదారి భద్రతను కాపాడేందుకు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో ఎస్ఐ ఎం. వెంకటరమణ ఆధ్వర్యంలో కఠిన తనిఖీలు, కేసుల నమోదు, అలాగే అవగాహన కార్యక్రమాలు వేగవంతంగా కొనసాగుతున్నాయి. జిల్లాలో ఓవర్‌లోడ్ వాహనాల వల్ల ప్రమాదాల ప్రమాదం పెరుగుతుండటంతో ఉన్నతాధికారులు ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ అమిత్ బర్ధర్, చింతపల్లి అదనపు ఎస్పీ నవజ్యోత్ మిశ్రా, సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం. వినోద్ బాబు ఆదేశాలతో ఎస్ఐ ఎం. వెంకటరమణ క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకుంటున్నారు. ఈ మేరకు ఎస్ఐ వెంకటరమణ నేతృత్వంలోని బృందం పలు ప్రాంతాల్లో వాహన తనిఖీలు నిర్వహించి ఓవర్‌లోడ్ కేసులను నమోదు చేస్తోంది. నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులపై కేసులు నమోదు చేయడమే కాకుండా, డ్రైవర్లకు రహదారి భద్రతపై అవగాహన కల్పిస్తూ





కౌన్సిలింగ్ కూడా నిర్వహిస్తున్నారు. చిన్న పొరపాట్లు పెద్ద ప్రమాదాలకు దారితీస్తాయని వారికి వివరించి, నియమాలను తప్పనిసరిగా పాటించాలని సూచిస్తున్నారు. ఇక శుభకార్యాలు, పెళ్లిళ్లకు వెళ్లే వాహనాల్లో కూడా పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించడంతో పాటు, కొందరు ప్రయాణ సమయంలో కేకలు వేస్తూ ఇతర వాహనదారులకు ఇబ్బందులు కలిగిస్తున్నారని పోలీసులు గుర్తించారు. ఈ విధమైన ప్రవర్తన రహదారి భద్రతకు ప్రమాదకరమని ఎస్ఐ వెంకటరమణ స్పష్టం చేశారు. ఇలాంటి పద్ధతిని వెంటనే మార్చుకోవాలని, లేకపోతే వాహనాలను సీజ్ చేయడంతో పాటు సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు. వేడుకల కోసం కూడా రోడ్డు నియమాలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఈ చర్యల వల్ల ఓవర్‌లోడ్ వాహనాల నియంత్రణలో గణనీయమైన ఫలితాలు కనిపిస్తున్నాయని అధికారులు తెలిపారు. ఇకపై కూడా నిరంతర తనిఖీలు కొనసాగుతాయని, రహదారి భద్రత విషయంలో ఎటువంటి అలసత్వం సహించబోమని ఎస్ఐ వెంకటరమణ స్పష్టం చేశారు.

# ప్లాస్టిక్ రహిత గ్రామాల కోసం స్వచ్ఛ రథం చింతూరులో ప్రారంభం

**ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రారంభోత్సవానికి ప్రజాప్రతినిధులను ఆహ్వానించిన ఎంపీడీవో శ్రీనివాస్ దొర**

**పోలవరం జిల్లా, చింతూరు, , మే 08 ( మనం న్యూస్ ) :** పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రభుత్వ ప్రతిష్టాత్మక కార్యక్రమం స్వచ్ఛ రథం చింతూరులో శుక్రవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని ఎంపీడీవో సున్నం శ్రీనివాస్ దొర ఘనంగా ప్రారంభించారు. ప్రజలకు అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో అన్ని పార్టీల నాయకులను భాగస్వాములుగా ఆహ్వానించారు. చింతూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు జెండా ఊపి స్వచ్ఛ రథాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. ప్లాస్టిక్ వ్యర్థాలు పర్యావరణానికి, మానవ జీవనానికి తీవ్ర హానికరంగా మారుతున్న నేపథ్యంలో గ్రామ స్థాయిలోనే వాటి సేకరణ, నియంత్రణ కోసం ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. ప్రజల్లో అవగాహన కల్పించడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, రీసైక్లింగ్ వ్యవస్థను బలోపేతం చేయడం ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యాలు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ, "ప్రతి ఇంటి



వద్ద నుంచి ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి వాటిని రీసైక్లింగ్‌కు పంపించడం ద్వారా గ్రామాలను స్వచ్ఛంగా ఉంచడం ఈ కార్యక్రమ ఉద్దేశ్యం" దానితో పాటుగా ఆర్థికంగా కుటుంబాలకు ఈ ప్లాస్టిక్ వ్యర్థాలు అమ్మకం, మారకం ద్వారా కూడా ఆర్థిక స్థిరత్వం ఏర్పడుతుందని తెలిపారు.

ప్రజల భాగస్వామ్యం లేకుండా స్వచ్ఛత సాధ్యం కాదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజల్లో మరింత అవగాహన కల్పించేందుకు స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులను కూడా ఆహ్వానించినట్లు అధికారులు తెలిపారు. ఇది పూర్తిగా ప్రభుత్వ కార్యక్రమమేనని, రాజకీయాలకు అతీతంగా ప్రజల సహకారం పొందడమే లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి గుంపెనపల్లి మోహన్, బీజేపీ మాజీ మండలాధ్యక్షుడు డి.వి.ఎస్ రమణారెడ్డి, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు ఎం.డి జహంగీర్, మార్కెట్ కమిటీ సభ్యులు పసుపులేటి సాల్మన్ రాజు, తుర్రం చిన్న ముత్తయ్య, కూటమి నాయకులు బంగారు లక్ష్మణ్, జనసేన నాయకులు మేడే సతీష్, ఎండి రియాజ్, శబరి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు మస్తాన్ జానీ తదితరులు పాల్గొన్నారు. ప్రజల వద్ద నుంచి సేకరించిన ప్లాస్టిక్ వ్యర్థాలకు బదులుగా నిత్యావసర వస్తువులు అందజేసే విధానం ద్వారా ప్రజలను ప్రోత్సహించనున్నట్లు అధికారులు తెలిపారు.

# గ్రామాల పరిశుభ్రతే లక్ష్యం

**మనం న్యూస్ కథనానికి స్పందన**

**అనకాపల్లి / చీడికాడ , మే 08 ( మనం న్యూస్ ) :** గ్రామాల పరిశుభ్రత లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని ఎంపీడీవో హేమ సుందర రావు అన్నారు. పేరుకే అగ్రహారం ఊరంతా దుర్గంధం అంటూ శుక్రవారం వెలువడిన కథనానికి స్పందించిన అధికారులు సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా కార్యదర్శి గోపి మనం న్యూస్ ప్రతినిధితో మాట్లాడుతూ గ్రామంలో గత కార్యదర్శి వల్ల సమస్యలు నెలకొన్నాయని పంచాయతీ కార్మికునికి సకాలంలో వేతనాలు ఇవ్వకపోవడంతో అతను విధుల నుండి తొలగిపోయారన్నారు. అయితే ప్రస్తుతం నూతనంగా పంచాయతీ కా పరిశుభ్రతకు కార్మికుడిని ఎంపిక చేయాల్సి ఉందని గతంలో కొన్ని సమస్యల వల్ల పంచాయతీపై అధికారుల నుండి సమస్య తలెత్తిందన్నారు. గ్రామంలో చెత్తా సిద్ధారం తొలగించేందుకు వాహనం లేకపోవడంతో అధికారులకు నిర్వహించడం జరిగిందని అయితే ప్రభుత్వం పంచాయతీలకు వాహనాలు కేటాయించినప్పటికీ మాడుగుల ఎమ్మెల్యే ఆధ్వర్యంలో వాహనాన్ని ప్రారంభిం చేందుకు నిర్ణయించడంతో ఈ గ్రామంలో పారిశుద్ధ్యం తొలగించేందుకు వాహనాన్ని ఏర్పాటు చేయలేకపోవడం జరుగుతుందన్నారు. త్వరలో గ్రామాన్ని పరిశుభ్రంగా మార్చేందుకు చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు

# నేడు అవంతి కళాశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

**తగరపువలస , మే 08 ( మనం న్యూస్ ) :** అవంతి విద్యా సంస్థలు చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శనివారం అవంతి ఇంజనీరింగ్ కళాశాల, శ్రీ గాంధీ ఆడిటోరియములో 2020 సంవత్సరము నుండి 2025 సంవత్సరం మధ్యలో చదువు పూర్తి చేసుకున్న ఇంజనీరింగ్, ఫార్మసీ మరియు మేనేజ్మెంట్ స్టడీస్ విద్యార్థుల కోసం అత్యంత వైభవంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం పాత జ్ఞాపకాలను నెమరువేసుకోవడం, పూర్వ విద్యార్థుల మధ్య అనుబంధాన్ని పెంచడం మరియు ప్రస్తుత విద్యార్థులకు మార్గనిర్దేశం చేయడం అలాగే అనుభవాలను భాగస్వామ్యం చేసుకుంటూ ప్లేస్మెంట్స్ కోసము ఇండస్ట్రీ నెట్వర్కింగ్




పెంచడం జరుగుతుందని తెలిపారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా నరేంద్ర నెర్ల, ఇండియన్ డైరెక్టర్ ఎట్ క్లైమేట్ సెన్స్ ఇంక్, మిస్టర్ టి. సురేష్ కుమార్, హెచ్.ఆర్ హెడ్ జింథే, విశాఖపట్నం మరియ డాక్టర్ వి. సుమన్ కుమార్, డైరెక్టర్ అండ్ హెడ్ – రెగ్యులేటరీ అఫైర్స్, ఈసాయి ఫార్మాష్యూటికల్ కంపెనీ విచ్చేయనున్నారు. పూర్వ విద్యార్థులకి కావాల్సిన అన్ని రకాల సదుపాయాలను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. మురళికృష్ణ, డైరెక్టర్స్ డా. ఏ. చంద్రశేఖర్, ఎస్. విశ్వప్రసాద్, వివిధ విభాగాధిపతుల, అధ్యాపకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

# 'పార్టీకి వెన్నెముక కార్యకర్తలే' : బండారు అప్పలనాయుడు



**దేవరాపల్లి , మే 08 ( మనం న్యూస్ ) :** "పార్టీని నడిపించేది నాయకులు కాదు, కార్యకర్తలే అధినేతలు" అని టీడీపీ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి బండారు అప్పలనాయుడు అన్నారు. మంత్రి నారా లోకేష్ స్ఫూర్తితో దేవరాపల్లి మండలం గరిసింగి గ్రామంలో శుక్రవారం 'కార్యకర్తే అధినేత' కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు పెద్దాడ వెంకటరమణ అధ్యక్షతన జరిగిన ఈ సభలో బండారు మాట్లాడుతూ, పార్టీ జెండా పట్టిన ప్రతి కార్యకర్తకు అన్యాయం జరగదని హామీ ఇచ్చారు. వర్గ విభేదాలు వీడి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని కోరారు. కార్యకర్తలు తమ సమస్యలను దరఖాస్తు రూపంలో ఇవ్వాలని సూచించారు. గ్రామంలో స్మశాన వాటిక అభివృద్ధి, కల్యాణ మండపం నిర్మాణం, సీసీ రోడ్లు, డ్రైనేజీల ఏర్పాటుపై గ్రామస్తులు, కార్యకర్తలు వినతులు అందజేశారు. వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రైవాడ ప్రాజెక్ట్ చైర్మన్ పోతల పాత్రనాయుడు, శరకన సూర్యనారాయణ, గర్రెడ్డి కొండలరావు, కొట్యాడ అప్పలనాయుడు, గంధం శంకర్రావు, గొంతిన నరసింహనాయుడు, పెంటకోట అప్పలనాయుడు, వెంసలి పైడ్రాజు, వనం వెంకటేష్, రెడ్డి రామానాయుడు, కిల్లి రామునాయుడు తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కౌమార బాలికల సాధికారతకు 'కిషోర్ వికాసం – 2026'

**- ఆరోగ్యం, విద్య, ఆత్మరక్షణపై ప్రత్యేక అవగాహన**

**- మడుతూరు అంగన్వాడీ కేంద్రంలో ఘనంగా ముగింపు**

**అచ్యుతాపురం , మే 08 ( మనం న్యూస్ ) :** కౌమార బాలికల్లో ఆత్మవిశ్వాసం, ఆరోగ్య చైతన్యం, వ్యక్తిత్వ వికాసం పెంపొందించేందుకు ప్రభుత్వం చేపడుతున్న 'కిషోర్ వికాసం -2026' కార్యక్రమం ఎంతో ఉపయోగకరమని పీడీ సూర్యలక్ష్మి పేర్కొన్నారు. మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మడుతూరు అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమం శుక్రవారం ఘనంగా ముగిసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కౌమార దశలో ఉన్న బాలికలు ఆరోగ్యం, చదువు, వ్యక్తిత్వ వికాసంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. పోషకాహారం తీసుకోవడం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని తెలిపారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, మొబైల్ ఫోన్ల



వినియోగంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని జీవితంలో ఉన్నత లక్ష్యాలను సాధించాలని పిలుపునిచ్చారు. పీవో ఇందిరాదేవి మాట్లాడుతూ చిన్న వయసులోనే సరైన అవగాహన పెంపొందించుకుంటే బాలికలు సమాజంలో మంచి మార్పు తీసుకురాగలరని అన్నారు. విద్యతో పాటు జీవన నైపుణ్యాలు కూడా అవసరమని పేర్కొన్నారు. అంగన్వాడీ సూపర్వైజర్ సుహాసిని మాట్లాడుతూ బాలికల ఆరోగ్యం, భద్రత కోసం ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా బాలికలకు రక్తహీనత నివారణ, సమతుల ఆహారం, బాల్య వివాహాల నివారణ, మానసిక ఆరోగ్యం, సైబర్ భద్రత వంటి అంశాలపై అవగాహన కల్పించారు. యోగా, క్రీడలు, వ్యాసరచన, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన విద్యార్థినులను అభినందించారు.

# భార్య హత్య కేసులో భర్తకు యావజ్జీవ శిక్ష

**విశాఖపట్నం , మే 08 ( మనం న్యూస్ ) :** భార్యను హత్య చేసిన కేసులో ముద్దాయి కొర్రా రామారావుకు యావజ్జీవ కారాగార శిక్షతో పాటు రూ.1,000 జరిమానా విధిస్తూ విశాఖపట్నం జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు తీర్పు వెలువరించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ సమిరెడ్డి రామ్మూర్తి నాయుడు తెలిపిన వివరాల ప్రకారం, అల్లూరి సీతారామరాజు జిల్లా తమ్మంగుల పంచాయతీ, ఎ.అన్నవరం పోలీస్ స్టేషన్ పరిధిలోని పూతికమెట్ట గ్రామానికి చెందిన కొర్రా రామారావుకు, అదే గ్రామానికి చెందిన కొర్రా కోనితో సుమారు 30 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. అప్పటి నుంచి రామారావు మద్యం సేవించి తరచూ భార్యతో గొడవపడుతూ ఆమెపై అనుమానంతో వేధింపులకు పాల్పడేవాడు. 2015 మార్చి 20వ తేదీ రాత్రి మద్యం మత్తులో ఇంటికి వచ్చిన రామారావు భార్యతో ఘర్షణకు దిగాడు. ఈ క్రమంలో కత్తితో దాడి చేయడంతో ఆమె మోచేతికి తీవ్ర గాయం అయింది. అనంతరం ఆమె కిందపడిపోగా, గుండెలపై పలుమార్లు కాలితో తన్నడంతో అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి తమ్ముడు మర్రి నాగేశ్వరరావు ఫిర్యాదు మేరకు అప్పటి ఎ.అన్నవరం ఎస్ఐ జి.ఉమామహేశ్వరరావు Cr.No.06/2015 కింద ఖూజ 302 సెక్షన్ ప్రకారం కేసు నమోదు చేశారు.

అప్పటి చింతపల్లి సీఐ సి.హెచ్.రుద్రశేఖర్ దర్యాప్తు చేపట్టి సాక్ష్యాధారాలను కోర్టుకు సమర్పించారు. కేసు విచారణలో పోలీసుల తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్లు జీఎస్ఎన్వీ ప్రసాదరావు, మట్ట ఖజానారావు, సమిరెడ్డి రామ్మూర్తి నాయుడు వాదనలు వినిపించారు. నేరం రుజువుకావడంతో కోర్టు యావజ్జీవ శిక్ష విధించింది. ఈ కేసులో సమర్థవంతంగా దర్యాప్తు నిర్వహించిన చింతపల్లి పోలీసులను ఎస్పీ అమిత్ బర్ధర్, అదనపు ఎస్పీ నవజ్యోత్ మిశ్రాలు అభినందించారు.

# ఎంపీటీసీ కొర్ర భీమరాజుకు ఘన నివాళి

## పార్టీ జెండాతో అంతిమ వీడ్కోలు...మండలానికి తీరని లోటని నేతల ఆవేదన



**గూడెంకొత్తవీధి , మే 08 ( మనం న్యూస్ ) :** అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ అకాల మరణం చెందిన దామనపల్లి పంచాయతీ ఎంపీటీసీ కొర్ర భీమరాజు మృతదేహానికి స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. భీమవరం గ్రామంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు, కార్యకర్తలు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆయనకు కన్నీటి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ భీమరాజు మృతి మండలానికి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. సీనియర్ నాయకునిగా పార్టీ బలోపేతానికి, గ్రామాభివృద్ధికి ఆయన అందించిన సేవలను స్మరించుకున్నారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ఎల్లప్పుడూ ముందుండే నాయకుడిగా భీమరాజు గుర్తుండిపోతారని పేర్కొన్నారు. పార్టీకి ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండాతో ఘన నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతూ, పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా కల్పించారు. భీమరాజు లేని లోటు పార్టీకి, గ్రామ ప్రజలకు ఎప్పటికీ తీరదని పలువురు నేతలు భావోద్వేగానికి గుర య్యారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ లు బోయిన కుమారి, అనూష దేవి, రాష్ట్ర పంచాయతీరాజ్ కార్యదర్శి బొబ్బిలి లక్ష్మణ్, సీనియర్ నాయకులు దామనపల్లి మాజీ సర్పంచ్ కుందేరి రామకృష్ణ, దేవరపల్లి ఎంపీటీసీ కృష్ణమూర్తి, వైస్ ఎంపీపీ సప్పగడ్డ ఆనంద్‌తో పాటు పార్టీ శ్రేణులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విశాఖ రైల్వే జోన్ సాధన చారిత్రాత్మకం..!!

## ఉత్తరాంధ్ర అభివృద్ధికి కొత్త దిశ..శివశంకర్‌కు అభినందనలు



**ఆనందపురం , మే 08 ( మనం న్యూస్ ) :** ఎన్నో ఏళ్లుగా ఉత్తరాంధ్ర ప్రజల ఆకాంక్షగా ఉన్న విశాఖ రైల్వే జోన్‌కు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ప్రాంత వ్యాప్తంగా ఆనందోత్సాహాలు వెల్లువెత్తుతున్నాయి. ఈ సందర్భంగా విశాఖ రైల్వే జోన్ సాధన కోసం అనేక ఉద్యమాలు, ధర్నాలు, నిరసనలు నిర్వహిస్తూ నిరంతరం పోరాటం చేసిన ఉత్తరాంధ్ర రక్షణ వేదిక అధ్యక్షులు, సీనియర్ జర్నలిస్టు శివశంకర్‌ను ఉత్తరాంధ్ర గ్రామీణ వైద్యులు సంఘం ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. విశాఖలో జరిగిన ఈ సమావేశం లో పలువురు సంఘాల నాయకులు పాల్గొని శివశంకర్ సేవలను కొనియాడారు. ఉత్తరాంధ్ర ప్రజల హక్కుల కోసం ఆయన ఎన్నో సంవత్సరాలుగా నిరంతరంగా పోరాడుతున్నారని, విశాఖ రైల్వే జోన్ సాధనలో ఆయన పాత్ర విశేషమని పేర్కొన్నారు. ఈ జోన్ ఏర్పాటుతో ఉత్తరాంధ్ర జిల్లాల అభివృద్ధికి ఊతమిస్తుందని, ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు రైల్వే రంగంలో మరిన్ని సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఉత్తరాంధ్ర గ్రామీణ వైద్యులు సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు జంగం జోషి మాట్లాడుతూ, విశాఖ రైల్వే జోన్ సాధన ప్రాంత ప్రజల దీర్ఘకాల స్వప్నమని తెలిపారు. ఈ విజయానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలియజేశారు. జోనల్ అడ్వైజర్ కోన ప్రకాశ్ మాట్లాడుతూ, ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం ప్రజలందరూ ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పోర్ట్ ట్రస్ట్ ప్రతినిధులు వెంకట్, విజయ్, బీహెచ్‌పీఎం ఫౌండర్ జయరాజ్, పీఎస్ఆర్ గ్రూప్స్ ప్రతినిధి కనకరాజు తదితరులు పాల్గొని విశాఖ రైల్వే జోన్ సాధనపై హర్షం వ్యక్తం చేశారు. చివరగా శివశంకర్‌ను పూలమాలలతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

# 11,442 ఎకరాల అసైన్డ్ భూముల సేకరణకు కుట్ర

## ఎమ్మెల్యే బండారుపై సీపీఎం ధ్వజం



**మాడుగుల , మే 08 ( మనం న్యూస్ ) :** మాడుగుల నియోజకవర్గంలోని పేదలు, గిరిజనులు, దళితులు దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్న సుమారు 11,442 ఎకరాల అసైన్డ్ మరియు డి-పట్టా భూములను పారిశ్రామికీకరణ పేరుతో బలవంతంగా లాక్కునేందుకు ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి ప్రభుత్వం ద్వారా కుట్ర పన్నుతున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి. వెంకన్న తీవ్రస్థాయిలో మండిపడ్డారు. శుక్రవారం ఆయన విడుదల చేసిన పత్రిక ప్రకటనలో పేర్కొన్న వివరాలు ఇలా ఉన్నాయి., ప్రభుత్వ భూసేకరణ తీరును ఎండగట్టారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో భారీ ఎత్తున భూములను సేకరించడానికి ప్రణాళికలు సిద్ధం చేశారని వెంకన్న ఆరోపించారు. ముఖ్యంగా కే.కోటపాడు మండలంలో సెజ్‌ల పేరుతో అత్యధికంగా 10,250 ఎకరాలను సేకరించాలని చూడటం గమనార్హం. అలాగే దేవరాపల్లి మండలంలోని కొండ కోడాబు, సమ్మెద కోత్తూరు, చింతలపూడి, కోరాడ గ్రామాల్లో అదానీ హైడ్రో పవర్ ప్లాంట్ కోసం 820 ఎకరాలు, చీడికాడ మండలంలో సోలార్ ప్లాంట్ పేరుతో 262 ఎకరాలు, వి.మాడుగుల మండలం తాటిపర్తిలో వీఎంఆర్‌డీఏ అవసరాల కోసం 110 ఎకరాలను స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారని ఆయన వివరించారు. రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నా ప్రభుత్వం మొండిగా ముందుకు వెళ్తోందని వెంకన్న విమర్శించారు. ఆర్లి పంచాయతీలో రైతులు తమ భూములను ఇవ్వబోమని తెగేసి చెప్పినప్పటికీ, ఎమ్మెల్యే తన అనుకూల వర్గాన్ని ఆర్డీవో వద్దకు పంపించి రైతులందరూ సెజ్‌కు అంగీకరించినట్లు తప్పుడు సమాచారం ఇప్పిస్తున్నారని ఆరోపించారు. చీడికాడలో రైతులు లీజుకు ఇచ్చే ప్రసక్తి లేదని స్పష్టం చేసినా, అధికారులు బలవంతంగా నోటీసులు జారీ చేస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసలు పరిశ్రమల ఏర్పాటు కంటే, 'ల్యాండ్ బ్యాంక్' పేరుతో భూములను పోగు చేసి భవిష్యత్తులో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయడమే ప్రభుత్వ అసలు ఉద్దేశమని ఆయన విమర్శించారు. గతంలో పరవాడ ప్రాంతాన్ని కాలుష్యమయం చేసిన ఎమ్మెల్యే, ఇప్పుడు పచ్చటి పంటపొలాలతో కళకళలాడే మాడుగుల నియోజకవర్గాన్ని నాశనం చేయాలని చూస్తున్నారని దుయ్యబట్టారు. మాడుగుల అభివృద్ధి చెందాలంటే ముందుగా మూతపడిన షుగర్ ఫ్యాక్టరీని తెరిపించాలని, వ్యవసాయ అనుబంధ పరిశ్రమలను ప్రోత్సహించాలని డిమాండ్ చేశారు. రైతుల పొట్ట కొట్టి కార్పొరేట్ శక్తులకు భూములను కట్టబెడితే సీపీఎం చూస్తూ ఊరుకోదని, గిరిజనులు మరియు రైతులతో కలిసి పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాన్ని నిర్వహిస్తామని డి. వెంకన్న హెచ్చరించారు.




# రక్తహీనత నివారణపై అవగాహన

**ఆనందపురం , మే 08 ( మనం న్యూస్ ) :** భీమిలి ప్రాజెక్టు పరిధిలోని ఎల్.వి. పాలెం సెక్టార్ రామవరం అంగన్‌వాడీ కేంద్రంలో కిశోరి వికాసం కార్యక్రమంలో భాగంగా మూడవ సెషన్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సఖి, యువా గ్రూపులకు చెందిన కిశోర బాలబాలికలకు ఆరోగ్యం, పోషకాహారం మరియు రక్తహీనత (అనీమియా) నివారణపై ప్రత్యేక అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్వైజర్ పి.వి.వి. రత్నం మాట్లాడుతూ, కౌమార దశలో శారీరక మరియు మానసిక ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని తెలిపారు. ముఖ్యంగా బాలికల్లో రక్తహీనత సమస్య అధికంగా కనిపిస్తోందని, దీని నివారణకు ఐరన్ అధికంగా ఉండే ఆహార పదార్థాలను రోజువారీ ఆహారంలో భాగం చేసుకోవాలని సూచించారు.

ఆకుకూరలు, గుడ్లు, పాలు, పండ్లు, పప్పుదినుసులు వంటి పోషకాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని వివరించారు. ప్రొటెక్షన్ ఆఫీసర్ (ఇన్‌స్టిట్యూషనల్ కేర్) దాసరి చంద్రశేఖర్ మాట్లాడుతూ, బాల్య వివాహాల నివారణ, పోక్సో చట్టం, బాలల హక్కులు మరియు చైల్డ్ హెల్ప్‌లైన్ సేవల గురించి కిశోర బాలబాలికలకు అవగాహన కల్పించారు. విద్యతో పాటు జీవన నైపుణ్యాలు కూడా ఎంతో అవసరమని, సరైన అవగాహనతోనే మంచి భవిష్యత్తు నిర్మించుకోవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులతో పరస్పర చర్చ నిర్వహించి, వారి సందేహాలకు సమాధానాలు ఇచ్చారు. ఆరోగ్య పరిరక్షణ, వ్యక్తిగత పరిశుభ్రత, మానసిక ధైర్యం వంటి అంశాలపై కూడా సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో సోషల్ వర్కర్ నరేంద్ర, చైల్డ్ లైన్ కేస్ వర్కర్ అంబేద్కర్, అంగన్‌వాడీ టీచర్లు నాగమణి, మార్లా తదితరులు పాల్గొన్నారు.

### శ్రీ మోదకొండమ్మ అమ్మవారి పండగను పురస్కరించుకుని ఫోటోగ్రఫీ పోటీలు



**ఏ ఎస్ ఆర్ జిల్లా (పాడేరు ) , మే 08 ( మనం న్యూస్ ) :** మే నెల తేది : 17,18 మరియు19 న జరగనున్న మోదకొండమ్మ జాతర సందర్భంగా ఫోటో గ్రఫీ ప్రదర్శన పోటీలు నిర్వహించడం జరుగుచున్నది. పాడేరు ప్రాంత ఆరాధ్య దైవం శ్రీ మోదకొండమ్మ అమ్మవారి పండగను పురస్కరించుకుని, జిల్లా సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతిబింబించేలా ఫోటోగ్రఫీ పోటీలను నిర్వహిస్తున్నామని జిల్లా జాయింట్ కలెక్టర్, తిరుమాని శ్రీపూజ తెలియజేశారు జిల్లాలో ఆసక్తి గల ఫోటోగ్రాఫర్లు, ఔత్సాహికులు ఈ పోటీలో పాల్గొనవలసిందిగా కోరుచున్నాము.

**పోటీ నిబంధనలు మరియు వివరాలు**

అభ్యర్థులు 3 ఫోటోలు మించకుండా ఫోటోలను సమర్పించాల్సి ఉంటుంది. (3 ఫోటోలు) 5 వీదీ కి మించి ఉండరాదు. జిల్లా యొక్క విశిష్టత, సంస్కృతి మరియు సంప్రదాయాలు. పర్యాటక ప్రాంతాలు (Tourism) మరియు కల్చర్. గతంలో సంవత్సరం జరిగిన మోదకొండమ్మ పండగ ఉత్సవాలకు సంబంధించిన అరుదైన చిత్రాలు. ప్రతి ఫోటోకు ఆ ప్రాంతం పేరు, ఫోటో యొక్క వివరాలు, ఏ సందర్భంలోని ఫోటో, క్యాప్షన్ తప్పనిసరిగా వ్రాయాలి. ఈ ఫోటో కాంపిటీషన్లో పాల్గొని గెలుపొందిన వారికి మొదటి బహుమతి 15వేలు, ద్వితీయ బహుమతి10వేలు, తృతీయ బహుమతి 5వేలు చొప్పున బహుకరించడం జరుగుతుంది. ఈ ప్రైజ్ మనీతో పాటు ప్రశంస పత్రం ఇవ్వబడుతుందని తెలిపారు. గెలుపొందిన ఫోటోలను ఎగ్జిబిషన్ లో ప్రదర్శనగా జాతర మూడు రోజులు ప్రదర్శింపబడును. ఫోటోలు సమర్పించవలసిన ఈ నెల తేది 08-05-26 నుండి 10-05-2026 లోగా Jcasrdistrict @gmail.com, ఏఎస్ఆర్ జిల్లా పాడేరు వారికి ఆన్లైన్ email ద్వారా పంపించాలి.

# రూ.30వేలు కొట్టు..అక్రిడిటేషన్ పట్టు..!!

- రండి బాబోయ్ రండి
- అర్హతలు అనుభవాలు అక్కర్లేదు
- ఉత్తరాంధ్రలో కొనసాగుతున్న దందా
- పత్రికా విలువల పతనమా? వ్యవస్థలో లోపమా?"





**ఆనందపురం , మే 08 ( మనం న్యూస్ ) :** పత్రికా రంగం సమాజానికి నాలుగో స్తంభంగా పరిగణించబడుతూ ప్రజాస్వామ్యానికి బలమైన ఆధారంగా నిలుస్తోంది. అలాంటి రంగంలో కీలకమైన గుర్తింపుగా భావించే అక్రిడిటేషన్ కార్డుల వ్యవస్థపై ఇటీవల తీవ్రమైన ఆరోపణలు వెలుగులోకి రావడం చర్చనీయాంశంగా మారింది. అక్రిడిటేషన్ కార్డుల జారీ ప్రక్రియలో పారదర్శకత లేకపోవడం, అర్హతలకన్నా ఆర్థిక లావాదేవీలకు ప్రాధాన్యం ఇవ్వడం వంటి అంశాలు పత్రికా రంగంలో తీవ్ర ఆందోళనను కలిగిస్తున్నాయి. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం ఉత్తరాంధ్ర జిల్లాల్లో జరుగుతున్న బాగోతం ఇది. అక్రిడీటేషన్ బూచి చూపించి ఒక్కో అక్రిడిటేషన్ కార్డుకు రూ.30 వేలకుపైగా వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారం పత్రికా వర్గాల్లోనే కాకుండా సామాజిక వర్గాల్లో కూడా తీవ్ర చర్చకు దారితీసింది. సాధారణంగా అక్రిడిటేషన్ కార్డు అనేది అనుభవజ్ఞులైన, నిజాయితీగా పత్రికా రంగంలో పనిచేస్తున్న జర్నలిస్టులకు ఇవ్వాల్సిన గుర్తింపు. అయితే, ప్రస్తుతం పరిస్థితి అందుకు భిన్నంగా మారిందని సీనియర్ జర్నలిస్టులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అక్షర పరిజ్ఞానం కూడా సరిగా లేని వ్యక్తులకు సైతం ఈ గుర్తింపు కార్డులు లభిస్తున్నాయన్న విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. ఇది పత్రికా రంగ నైతికతకే మచ్చగా మారుతోందని వారు అంటున్నారు. ఈ పరిణామాలపై సీనియర్ జర్నలిస్టులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ, "ఇది నిజమైన పత్రికా విలువల పతనం. అర్హతలు, అనుభవం పక్కనపెట్టి డబ్బు ఆధారంగా గుర్తింపు ఇవ్వడం వ్యవస్థను బలహీనపరుస్తోంది" అని వ్యాఖ్యానిస్తున్నారు. పత్రికా రంగంలో ఇలాంటి పరిస్థితులు కొనసాగితే నిజమైన జర్నలిస్టులకు అన్యాయం జరుగుతుందని వారు హెచ్చరిస్తున్నారు. ఇంకా ప్రధానంగా ప్రశ్నలు లేవనెత్తుతున్న విషయం ఏమిటంటే –ఈ వ్యవస్థలో లోపం ఎక్కడ ప్రారంభమైంది? జారీ చేసే అధికారుల్లో నియంత్రణ లేకపోవడమా? లేక మధ్యవర్తుల జోక్యం పెరిగిపోవడమా? లేదా మొత్తం వ్యవస్థే లోపభూయిష్టంగా మారిందా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. పత్రికా రంగాన్ని నియంత్రించే సంబంధిత విభాగాలు ఈ ఆరోపణలపై ఇప్పటివరకు స్పష్టమైన చర్యలు తీసుకోకపోవడం కూడా మరింత అనుమానాలకు దారితీస్తోంది. "ఇలా కొనసాగితే అక్రిడిటేషన్ కార్డు విలువ పూర్తిగా నశిస్తుంది" అని పలువురు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. సామాజిక బాధ్యత కలిగిన పత్రికా రంగంలో ఇలాంటి అవినీతి ఆరోపణలు రావడం దురదృష్టకరమని పలువురు పేర్కొంటున్నారు. పత్రికా స్వేచ్ఛను కాపాడటమే కాకుండా దాని నైతిక విలువలను కూడా రక్షించాల్సిన అవసరం ఉందని వారు స్పష్టం చేస్తున్నారు.

ఈ నేపథ్యంలో, అక్రిడిటేషన్ కార్డుల జారీ ప్రక్రియను పూర్తిగా పునఃపరిశీలించి, కఠినమైన అర్హత ప్రమాణాలు, పారదర్శక విధానాలు అమలు చేయాలని పత్రికా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. అలాగే, ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఈ సమస్యను తీవ్రంగా తీసుకుని తగిన చర్యలు చేపడితేనే పత్రికా రంగంపై ప్రజలకు ఉన్న విశ్వాసం నిలబడుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. లేకపోతే, "పత్రికా విలువలు" అనే పదమే ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉందని వారు హెచ్చరిస్తున్నారు.

# దామనపల్లి ఎంపీటీసీ కొర్ర భీమరాజు కన్నుమూత

## మండలంలో విషాద ఛాయలు...రాజకీయ, ప్రజా వర్గాల సంతాపం




**గూడెంకొత్తవీది , మే 08 ( మనం న్యూస్ ) :** మండలంలోని దామనపల్లి పంచాయతీ పరిధిలో గల భీమవరం గ్రామానికి చెందిన స్థానిక ఎంపీటీసీ కొర్ర భీమరాజు శుక్రవారం విశాఖపట్నంలో మృతి చెందారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. భీమరాజు మరణ వార్త తెలిసిన వెంటనే మండలవ్యాప్తంగా విషాద ఛాయలు అలుముకున్నాయి. ప్రజా సమస్యల పరిష్కారంలో ఎప్పుడూ ముందుండే నాయకుడిగా, గ్రామ అభివృద్ధికి కృషి చేసిన ప్రజాప్రతినిధిగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉందని స్థానికులు పేర్కొన్నారు. సాధారణ ప్రజలతో సన్నిహితంగా మెలుగుతూ గ్రామ ప్రజల విశ్వాసాన్ని సంపాదించుకున్నారని గ్రామ పెద్దలు గుర్తుచేసుకున్నారు. ఆయన మృతి పట్ల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులతో పాటు వివిధ రాజకీయ పార్టీల నేతలు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. భీమరాజు సేవలను స్మరించుకుంటూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన లేని లోటు గ్రామానికి, మండల రాజకీయాలకు తీరనిదని పలువురు అభిప్రాయపడ్డారు. భీమరాజు అంత్యక్రియలు స్వగ్రామమైన భీమవరంలో నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

# అంతర్జాతీయ వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఆర్యవైశ్యులకు అండ - రూ. 25 వేల ఆర్థిక సాయం అందజేత



**మాడుగుల , మే 08 ( మనం న్యూస్ ) :** నిరుపేద ఆర్యవైశ్య కుటుంబాల్లోని ఆడబిడ్డల వివాహాలకు అండగా నిలవడమే అంతర్జాతీయ వాసవి క్లబ్ ప్రధాన ఆశయమని ఆ సంస్థ జిల్లా గవర్నర్ పి.వి. రమణమూర్తి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన చీడికాడ మండలంలో పర్యటించి, వాసవి క్లబ్ ఆధ్వర్యంలో చేపడుతున్న పలు సేవా కార్యక్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా క్లబ్ సభ్యులు బత్తుల వెంకట నాగేశ్వరరావు కుమార్తె స్నేహ వివాహం నిమిత్తం 'కళ్యాణమస్తు' పథకం ద్వారా మంజూరైన 25 వేల రూపాయల ఆర్థిక సాయాన్ని ఆయన కుటుంబ సభ్యులకు అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో గవర్నర్ మాట్లాడుతూ, సమాజంలోని వెనుకబడిన వర్గాలకు, ముఖ్యంగా స్వజాతిలోని పేదవారికి తోడ్పాటునందించడంలో వాసవి క్లబ్ ఎల్లప్పుడూ ముందుంటుందని కొనియాడారు. కేవలం ఆర్థిక సాయమే కాకుండా, గ్రామాల అభివృద్ధిలో కూడా తమ వంతు బాధ్యతను నిర్వర్తిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే వాకపల్లి గ్రామంలో ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన సిమెంట్ బల్లను ఆయన ప్రారంభించారు. సంస్థలో సేవా దృక్పథం కలిగిన వారిని ప్రోత్సహించే క్రమంలో ఐదుగురు కొత్త సభ్యులకు సభ్యత్వ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు పూసర్ల కిరణ్, పసుమర్తి లక్ష్మణ్, జిల్లా ఇన్చార్జిలు పుట్టా మల్లికార్జునరావు, పుట్టా నానాజీ, క్లబ్ అధ్యక్షుడు బత్తుల వెంకట నాగేశ్వరరావు మరియు ఇతర సభ్యులు పాల్గొన్నారు. క్లబ్ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి పేదవారికి భరోసా కల్పిస్తామని ఈ సందర్భంగా ప్రతినిధులు స్పష్టం చేశారు.




# శ్రీ మడకొండమ్మ అమ్మవారి జాతర ఏర్పాట్లపై సమీక్ష

## జిల్లా జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీపూజ

**ఏఎస్ఆర్ జిల్లా (పాడేరు ) , మే 08 ( మనం న్యూస్ ) :** శ్రీ మడకొండమ్మ అమ్మవారి జాతరను అత్యంత వైభవంగా, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నిర్వహించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశం మందిరంలో జాతర ఏర్పాట్లపై అన్ని శాఖలజిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె కీలక సూచనలు చేశారు. జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి సౌకర్యాలు కాకుండా చూడాలని,ఎండ తీవ్రత దృష్ట్యా భక్తుల కోసం చలువ పందిళ్లు, క్యూ లైన్లలో మంచినీటి సౌకర్యం నిరంతరం అందుబాటులో ఉంచాలని సూచించారు. జాతర ప్రాంగణంలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి. తగినన్ని తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేయడంతో పాటు, వైద్య శిబిరాలను (Medical Camps) 24 గంటలూ అందుబాటులో ఉండే విధంగా చూడాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి గారికి ఆదేశించారు. రవాణా ఌ పార్కింగ్, భక్తుల రద్దీకి అనుగుణంగా అదనపు బస్సు సర్వీసులను నడపాలని, వాహనాల పార్కింగ్ విషయంలో ఎటువంటి ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని పోలీసు శాఖను ఆదేశించారు. విద్యుత్ సరఫరా, జాతర జరిగే 3 రోజుల్లో అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరాను ఉండే విధంగా చూడాలన్నారు . రాత్రి వేళల్లో తగినంత వెలుతురు ఉండేలా లైటింగ్ ఏర్పాట్లు చేయాలని, భక్తుల ?భద్రత ,తోపులాటలు జరగకుండా పటిష్టమైన బారికేడ్ల నిర్మాణం చేపట్టాలని, సిసి కెమెరాల ద్వారా నిఘా ఉంచాలని సూచించారు. భక్తుల రద్దీ ఉన్న సెంటర్లలో ఎల్ఈడీలు ఏర్పాటు చేయాలని సూచించారు. "అమ్మవారిని దర్శించుకోవడానికి వచ్చే భక్తులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా చూడటమే మన ప్రాధాన్యత. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సంస్కృతి కార్యక్రమాల నిర్వహణ, స్టేజ్ ఏర్పాట్లు, కళాకారులకు వసతి ఏర్పాటు, జిల్లా ప్రగతిపై వివిధ శాఖల ఏర్పాటు చేసే ఎగ్జిబిషన్ స్టాల్స్ ఏర్పాట్లు పై సమంత శాఖ అధికారులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు, అందుకు సంబంధించి 3 స్విఫ్ట్ డ్యూటీల వివరాలపై ఆరా తీశారు. కంట్రోల్ రూమ్ లో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసే ఎక్కడ ఏ సంఘటన జరిగినా వెంటనే సంబంధిత పోలీస్ రెవిన్యూ శాఖలకు సమాచారం అందించాలన్నారు. ఈ సమావేశంలో ఐటిడి ఏ ప్రాజెక్ట్ అధికారి ఆదిత్య వర్మ, ఏ ఎస్ పి, ఉత్సవ కమిటీ అధ్యక్షురాలు గిడ్డి ఈశ్వరి,జిల్లా రెవెన్యూ అధికారి ఎంవి ఎస్ లోకేశ్వరరావు, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# భారీ వర్షం ఇల్లు ధ్వంసం

## రాగులు, గృహసామగ్రి మొత్తం నష్టం



**ముంచంగిపుట్టు , మే 08 ( మనం న్యూస్ ) :** ముంచింగి పుట్టు మండలంలోని అత్యంత మారుమూల బూసి పుట్టు పంచాయతీ పరిధిలో గల పిట్ట గుడ్డ గ్రామంలోనీ నివాసులైన కొరవంగి రాంబాబు, భార్య కాసులమ్మ ల గృహం గురువారం సాయంత్రం మూడు గంటల సమయంలో ఈదురు గాలులతోపాటు కురిసిన భారీ వర్షానికి గృహం పైకప్పు రేకులుధ్వంసమై గృహ సామాగ్రి, ధాన్యం, రాగులు, కందులు, మినుములు, చిరుధాన్యాలు సమస్తము తడిచి నష్టపోయామని శు క్రవారం మండల పాత్రికేయులకు పత్రిక ప్రకటనలు తెలిపారు. గృహ యజమాని అయిన కొరవంగి రాంబాబు మాట్లాడుతూ మండలంలోని శివారి గ్రామంలో నివాసం ఉంటూ పేదరికం కలిగి కుటుంబాన్ని పోషించుకుంటున్నామన్నారు. గురువారం సాయంత్రం విపరీతమైన గాలులతో కూడిన వర్షం బీభత్సానికి గృహం ధ్వంసమై తీవ్ర ఆందోళన చెందుతున్నమన్నారు. నలుగురు సంతానం కలిగి అతి కష్టం మీద కుటుంబాన్ని పోషించుకుంటు జీవనాన్ని సాగిస్తున్న మాకు ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు తక్షణమే స్పందించి నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన గృహ నిర్మాణ పథకంలో పేరు నమోదైఉన్నప్పటికీ కూటమి ప్రభుత్వం గృహ నిర్మాణాలకు నేటికీ అధికారికంగా ప్రకటించలేదని ఆవేదించారు.. పక్క గృహం నిర్మించుకోవడానికి ప్రభుత్వం నిధులు విడుదల చేసి సహకరించాలని కోరారు. గత ఐదేళ్ల క్రితం మావోయిస్టు ప్రభావితం కారణంగా రోడ్డు నిర్మాణాలకు ప్రభుత్వ అధికారులు చొరవ చూపలేదు.. ప్రస్తుతం ఆ ప్రభావితం తగ్గినప్పటికీ ప్రభుత్వ అధికారులు చలనం చూపించకపోవడం విచారకరం అన్నారు. రోడ్లు నిర్మాణాలు చేపట్టి రాకపోకలరవాణా సౌకర్యాలు అందిస్తే కనీస అవసరాలు అయినా తీర్చుకునే వీలుంటుందని గుర్తు చేశారు. గృహం పై కప్పు రేకులు మండల కేంద్రం నుండి తెచ్చుకోవాలన్న రవాణా సౌకర్యం సక్రమంగా లేక అనేక అవస్థలను ఎదుర్కొని పరిస్థితులు ఉన్నాయని ఆవేదం వ్యక్తం చేశారు.

# ఆర్థిక సాయం చేసిన జై యాత సేవా సంఘం



**ఆనందపురం , మే 08 ( మనం న్యూస్ ) :** పద్మనాభం మండలం పద్మనాభం గ్రామంలో కల్లు గీత కులానికి చెందిన కోలుసు పెంటయ్య ఆదిలక్ష్మి దంపతులు ముగ్గురు పిల్లలతో నివసిస్తున్నటువంటి కమ్మలు ఇల్లు వారం రోజుల కిందట కాలిపోవడం జరిగింది. ఈ సంఘటనలో చదువుకుం టున్నటువంటి వాల పిల్లలు సర్టిఫికెట్లు మరియు బుక్స్ బట్టలు డబ్బులు వంట సామాగ్రి మొత్తం ఖాళీ బూడిద అయిపోవడంతో ఆ కుటుంబం రోడ్డున పడింది. చుట్టుపక్కల ఉన్న దాతలు కొంతవరకు సాయం చేసి తినడానికి బియ్యం నిత్యవసర వస్తువులు అందజేశారు ఈ వార్త విన్న విశాఖపట్నం జిల్లా జై యాత యువసేన సంక్షేమ సంఘం సభ్యులు స్పందించి మరి కొంతమంది గీత కులస్థుల దాతలు సాయంతో 14,500 రూపాయలు వాళ్ళ ఇంటికి వెళ్లి వాళ్ళతో మాట్లాడి ధైర్యం చెప్పి ఆర్థిక సాయం అందించారు.మరి ముఖ్యంగా బుత్తల సత్యం మాస్టర్ వాళ్ళ పాప ఇంటర్మీడియట్ చదువుతుందని తెలుసుకొని బుక్స్ కొరకు 3500 సాయం చేశారు.దాతలు ఎవరైనా ముందుకు వచ్చి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని విశాఖ జిల్లా జై యాత యువసేన వర్కింగ్ ప్రెసిడెంట్ గండిబోయిన రాంబాబు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో భీమిలి మార్కెట్ కమిటీ డైరెక్టర్ కుప్ప రామలక్ష్మి, బుత్తల సత్యం మాస్టర్ , పద్మనాభం మండల కల్లుగీత సహకార సంఘం సొసైటీ ప్రెసిడెంట్ జుత్తుక ఎర్రి నాయుడు, జై యాత యువసేన సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గండి బోయిన రాంబాబు, ఉపాధ్యక్షుడు బుత్తల రాజేష్, ప్రధాన కార్యదర్శి ముదసల శ్రీను, కోశాధికారి కుప్ప రామలక్ష్మి, జనరల్ సెక్రెటరీ రీస్ సంతోష్ కుమార్, సంఘం సభ్యులు చెల్లి బోయిన బంగారు రాజు, చెల్లిబోయిన కృష్ణ పాల్గొన్నారు.

# 'కిశోర్ వికాసం-2026'..బాలికలకు ఆరోగ్యం, అనీమియాపై అవగాహన



దేవరాపల్లి , మే 08 ( మనం న్యూస్ ) : కిశోర్ వికాసం-2026' కార్యక్రమంలో భాగంగా దేవరాపల్లి మండలంలోని కాశీపురం శివారు చంద్రయ్యపేట, ఎం.అలమండ, తెనుగుపూడి అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం కిశోర్ బాలబాలికలకు అవగాహన సమావేశం నిర్వహించారు. కె.కోటపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ పి.లలిత కుమారి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో 11 నుంచి 18 సంవత్సరాల వయస్సు గల బాలబాలికలకు ఆరోగ్యం, రక్తహీనత నివారణపై అవగాహన కల్పించారు. రక్తహీనత రాకుండా తీసుకోవాల్సిన ఆహార పదార్థాలు, పౌష్టికాహార ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఎన్.కళ్యాణి, ఎం.రాములమ్మ, ఆదిలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎర్రయమ్మ, సరోజిని, ఆశా కార్యకర్తలు సుశీల, పుష్పలత, ఆయా సంతోషి కుమారి తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడి కేంద్రంలో కిషోర్ వికాస వేసవికాల శిక్షణ



మాడుగుల , మే 08 ( మనం న్యూస్ ) : జిల్లా మహిళా భివృద్ధి,శిశు సంక్షేమ సాధికారత అధికారి జిల్లా బాల సంరక్షణ అధికారి వారి ఆదేశాలు మేరకు వి. మాడుగుల మండలంలో ఏం. కోడూరు గ్రామంలో అంగన్వాడి సెంటర్ పరిధిలో ఐసిడిఎస్ ప్రాజెక్ట్ వి. మాడుగుల సిడిపిఓ సూపర్వైజర్,అంగన్వాడి వర్కర్ వారి ఆధ్వర్యంలో సెక్షన్- 3"ఆరోగ్య మేల మరియు అనీమియా పై అవగాహన" గురించి "కిశోర వికాస వేసవికాలం శిక్షణ కార్యక్రమాలు"11 సంవత్సరం నుండి 18 సంవత్సరాల లోపు గల కౌమారదశ బాల బాలికలకు గ్రామస్థాయిలో సంఘాలను ఏర్పాటు చేసి వారంలో ప్రతి మంగళవారం, శుక్రవారం బాలుడికి వీటి ద్వారా కౌమార దశలో గల పిల్లల సమస్యలు గురించి, వారి సక్రమ మార్గం వైపు తీసుకువెళ్లడమే దీని ముఖ్య ఉద్దేశము అంతేకాకుండా బాల బాలికలు ఎవరు కూడా రక్తహీనత గురికాకుండా ఆరోగ్య సమస్యల నుండి ఎలాగా మెరుగుపడాలని, ఎలాగా ఆహారం తీసుకుంటే మంచిదని చెప్పడం జరిగింది. సెల్ఫ్ ఎవర్నెస్, ఆత్మవిశ్వాసన పెంచే స్వకియా అవగాహన, బాలల రక్షణ ,ఆరోగ్యము, విద్య, మంచి పోషకాహారము, వ్యక్తిగత పరిశు భ్రత విషయాలపై పూర్తి అవగాహన కల్పించి దీని యొక్క ముఖ్య ఉద్దేశం. ఈ కార్యక్రమంలో వి.మాడుగుల ప్రాజెక్ట్, సిడిపిఓ. ఎర్రయమ్మ , డిస్టిక్ సైకాలజిస్ట్ బి .అనిల్ కుమార్, అంగన్వాడి కార్యకర్తలు డిసిపియు సామాజిక కార్యకర్త పి మంగ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# దుర్గాలమ్మ ఆలయంలో విశేష పూజలు

## భక్తులకు అన్నప్రసాదం వితరణ






ఆనందపురం , మే 08 ( మనం న్యూస్ ) : మధురవాడ చంద్రంపాలెం జాతరగట్టు వద్ద ఉన్న శ్రీ దుర్గాలమ్మ అమ్మవారి ఆలయంలో వైశాఖ మాసం బహుళ షష్ఠి, తత్కాల సప్తమి శు క్రవారం సందర్భంగా విశేష పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు పట్నాల హరిప్రసాద్ శర్మ, మూర్తి శర్మలు అమ్మవారికి నిత్య పూజలు నిర్వహించి, భక్తుల గోత్రనామాలతో కుంకుమార్చనలు, పుష్పార్చనలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. సాయంత్రం వేళలో అమ్మవారికి పంచామృతాలు, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం కుంకుమార్చనలు, పుష్పార్చనలు, నైవేద్యాలు సమర్పించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కళకళలాడింది. జీవీఎంసీ 7వ వార్డు చంద్రంపాలెం వాసులు పి.వి.జి. అప్పారావు, యశోద దంపతులు అలాగే ఎండాడకు చెందిన రాంబాబు, వసంత దంపతుల సహాయ సహకారాలతో సుమారు 500 మంది భక్తులు, పేదలకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రసాదాన్ని స్వీకరిం చారు. చంద్రంపాలెం వాసులు గుజ్జారి వెంకన్న, కొండమ్మ దంపతుల సహకారంతో పులిహోర ప్రసాదాన్ని ఏర్పాటు చేసి అమ్మవారికి నివేదించిన అనంతరం భక్తులకు పంపిణీ చేశారు. ఇక వేసవి తీవ్రత దృష్ట్యా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రంలో భక్తులు, పాదచారులు, వాహనదారు లకు మజ్జిగ పంపిణీ నిర్వహించారు. ఐదు చేనేత సంఘాల సభ్యులు ఎం. నర్సింగరావు దంపతులు, శివశక్తి సాయి ఇంజినీరింగ్ వర్క్స్‌కు చెందిన షణ్ముఖ రెడ్డి, భానుమూర్తిల సహకారంతో సుమారు 400 లీటర్ల మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ కమిటీ అధ్యక్షులు పిళ్లా సూరిబాబు, ముఖ్య సభ్యులు పిళ్లా పోతరాజు, వాండ్రాసి అప్పారావు, పిళ్లా వెంకటరమణ, గ్రామ పెద్దలు పిళ్లా శ్రీనివాసరావు, పీస రామారావు, చేనేత సంఘ సభ్యులు కె. నాగేశ్వరరావు, ఆలయ కమిటీ ఉపాధ్యక్షులు పి.వి.జి. అప్పారావు, సెక్రటరీ నాగోతి తాతా రావు, కోశాధికారి పిళ్లా శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీ పిళ్లా మోహన్ శివకృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ పోతిన శివ, బంక వాసు, కమిటీ సభ్యులు పోతిన పైడిరాజు, బోగవిల్లి రాము, పిళ్లా రాజు, గూడేల రాజు, మరుపిల్లి ఆనంద్, పిళ్లా అప్పన్న, పిళ్లా సూరిపా త్రుడు, పోతిన రాంబాబు తదితరులు పాల్గొన్నారు. అమ్మవారి సేవకులు, గ్రామస్తులు కలిసి భక్తులకు అన్న ప్రసాదం, మజ్జిగ పంపిణీ కార్యక్రమా లనువిజయ వంతంగా నిర్వహించారు.

# శాంతిభద్రతలపై సీఎం సమీక్ష..దిశానిర్దేశాలు జారీ



శ్రీకాకుళం , మే 08 ( మనం న్యూస్ ) : రాష్ట్ర పరిపాలనను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దడం, అభివృద్ధి కార్యక్రమాల అమలును వేగవంతం చేయడం, ప్రజలకు మెరుగైన సేవలు అందించడంపై దృష్టి సారిస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన విజయవాడ సచివాలయంలో నిర్వహించిన జిల్లా కలెక్టర్ల సదస్సు రెండవ రోజు సమావేశంలో శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి పాల్గొన్నారు. ఈ సమావేశంలో రాష్ట్రవ్యాప్తంగా అమలవుతున్న పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై ముఖ్యమంత్రి సమగ్ర సమీక్ష నిర్వహించారు. గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు ప్రభుత్వ పథకాలు ప్రజలకు సమర్థవంతంగా చేరేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. ముఖ్యంగా పారదర్శక పరిపాలన, ప్రజా సమస్యల తక్షణ పరిష్కారం, ప్రభుత్వ సేవల డిజిటలైజేషన్, రెవెన్యూ వ్యవహారాల సరళీకరణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. అదేవిధంగా, జిల్లాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు శాఖ మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని సీఎం సూచించారు. మహిళలు, చిన్నారుల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ, నేరాల నియంత్రణలో సాంకేతికతను వినియోగించాలని పేర్కొన్నారు. సైబర్ నేరాల నివారణ, డ్రగ్స్ నియంత్రణ, ట్రాఫిక్ నిర్వహణ, ప్రజలతో పోలీసుల సమన్వయం వంటి అంశాలపై కూడా సమీక్ష జరిగింది. రాష్ట్ర అభివృద్ధిలో జిల్లాల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్న ముఖ్యమంత్రి, ప్రతి శాఖ సమన్వయంతో పని చేసి ప్రభుత్వ లక్ష్యాలను సమయానికి పూర్తి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా సేవలు అందించాలని, ప్రభుత్వ పథకాల ఫలితాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా కృషి చేయాలని స్పష్టం చేశారు.

సదస్సులో పాల్గొన్న జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి రాష్ట్ర ప్రభుత్వం సూచించిన మార్గదర్శకాలను శ్రీకాకుళం జిల్లాలో సమర్థవంతంగా అమలు చేయడానికి కట్టుబడి ఉన్నామని తెలిపారు. జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సేవలు, శాంతిభద్రతల పరిరక్షణలో సమన్వయంతో ముందుకు సాగుతామని పేర్కొన్నారు.

# స్టీల్ ప్లాంట్ సిఎండి గా ప్రభాకర్



**గాజువాక , మే 08 ( మనం న్యూస్ ) :** విశాఖ స్టీల్ ప్లాంట్ సిఎండీగా ఎం ఎన్ వి ఎస్ ప్రభాకర్ ను నియమించిన కేంద్ర ప్రభుత్వం ఈయన మన తెలుగు వారు పైగా శ్రీకాకుళం జిల్లాకు చెందిన వ్యక్తి ఈయన హయాంలో విశాఖ స్టీల్ ప్లాంట్ సమస్యలు పరిష్కారం అవుతాయని కార్మిక వర్గాలు ఆశిస్తున్నాయి.

# రాయితీపై వ్యవసాయ యంత్రాలకు దరఖాస్తులు ఆహ్వానం

## రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి : ఏవో గిరిబాబు



**గూడెంకొత్తవీధి , మే 08 ( మనం న్యూస్ ) :** మండల రైతులకు వ్యవసాయ యాంత్రీకరణను ప్రోత్సహిస్తూ కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక రాయితీతో వ్యవసాయ యంత్ర పరికరాలను అందించనున్నట్లు మండల వ్యవసాయ అధికారి దాసరి గిరిబాబు తెలిపారు. వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద మండలానికి మొత్తం రూ.19.83 లక్షలు కేటాయించినట్లు వెల్లడించారు. ఈ పథకం ద్వారా చిన్న, సన్నకారు, మహిళా రైతులకు 50 శాతం సబ్సిడీ, ఇతర రైతులకు 40 శాతం సబ్సిడీపై యంత్ర పరికరాలు అందించనున్నట్లు తెలిపారు.పంట సంరక్షణ పరికరాలు, పంట కోత అనంతర యంత్రాలు, పవర్ టిల్లర్లు, పంట అవశేషాల నిర్వహణ పరికరాలు, స్వయంచాలక వ్యవసాయ యంత్రాలు, ట్రాక్టర్ అనుసంధాన పరికరాలు, 40 హార్స్ పవర్ లోపు ట్రాక్టర్లకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. వ్యవసాయంలో కార్మిక వ్యయాన్ని తగ్గించి, దిగుబడులు పెంచేందుకు ప్రభుత్వం యాంత్రీకరణకు అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని ఈ నెల 19వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులను లేదా మండల వ్యవసాయ అధికారి కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు.

# పాములవాకలో కిషోర్ వికాస వేసవికాల శిక్షణ

**కోటఊరట్ల , మే 08 ( మనం న్యూస్ ) :** అనకాపల్లి జిల్లా మహిళాభివృద్ధి,శిశు సంక్షేమ సాధికారత అధికారి జిల్లా బాల సంరక్షణ అధికారి వారి ఆదేశాలు మేరకు కోటవురట్ల మండలంలో పాములవాక లో అంగన్వాడి సెంటర్ పరిధిలో సూపర్వైజర్,అంగన్వాడి వర్కర్ వారి ఆధ్వర్యంలో సెక్షన్- 3"ఆరోగ్య మేల అనీమియా పై అవగాహన" పై "కిశోర వికాస వేసవికాలం శిక్షణ కార్యక్రమాలు"11 సంవత్సరం నుండి 18 సంవత్సరాల లోపు గల కౌమారదశ బాల బాలికలకు గ్రామస్థాయిలో





సంఘాలను ఏర్పాటు చేసి వారంలో ప్రతి మంగళవారం, శుక్రవారం బాలుడికి వీటి ద్వారా కౌమార దిశలో గల పిల్లల సమస్యలు గురించి, వారి సక్రమ మార్గం వైపు తీసుకువెళ్లడమే దీని ముఖ్య ఉద్దేశము అంతేకాకుండా బాల బాలికలు ఎవరు కూడా రక్తహీనత గురికాకుండా ఆరోగ్య సమస్యల నుండి ఎలాగా మెరుగుపడాలన ఎలాగా ఆహారం తీసుకుంటే మంచిదని చెప్పడం జరిగింది. సెల్ఫ్ ఎవర్నెస్, ఆత్మవిశ్వాసన పెంచే స్వకియా అవగాహన, బాలల రక్షణ ,ఆరోగ్యము, విద్య, మంచి పోషకాహారము, వ్యక్తిగత పరిశుభ్రత విషయాలపై పూర్తి అవగాహన కల్పించి దీని యొక్క ముఖ్య ఉద్దేశం. ఈ కార్యక్రమంలో నక్కపల్లి ప్రాజెక్ట్,ఐసిడిఎస్ సూపర్వైజర్ ఆర్. హైమావతి , అంగన్వాడి కార్యకర్తలు పి వి లక్ష్మి, డిసిపియు సామాజిక కార్యకర్త ఎ. రూప కార్యక్రమంలో పాల్గొన్నారు.

# సింహాచలం స్వామి సన్నిధిలో విసి దంపతులు

**విశాఖపట్నం , మే 08 ( మనం న్యూస్ ) :** ఆంధ్ర యూనివర్సిటీ విశాఖపట్నం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ రాజశేఖర్ దంపతులుశుక్రవారం సింహాచల పుణ్యక్షేత్రంలోని శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి వారిని సందర్శించారు. వీరికి ఆలయ కార్యనిర్వహణాధికారి జల్లేపల్లి వెంకట్రావు వారికి ఆలయ రాజగోపురం వద్ద స్వాగతం పలికారు. నాదస్వర వాయిద్యాలు మరియు వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ వైస్ ఛాన్సలర్ దంపతులు కు ఆలయ మర్యాదలతో స్వాగతం లభించింది. దర్శనానికి ముందు, భక్తుల నమ్మకం ప్రకారం అత్యంత





మహిమాన్వితమైన కప్పస్తంభాన్ని వైస్ ఛాన్సలర్ భక్తిశ్రద్ధలతో ఆలింగనం చేసుకున్నారు. అనంతరం గర్భాలయంలోని స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు స్వామి వారి విశిష్టతను వివరించారు. దర్శనం అనంతరం ఆలయ మండపంలో వేద పండితులు వైస్ ఛాన్సలర్ దంపతులు కు వేద ఆశీర్వచనం గావించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి జె. వెంకట్రావు వైస్ ఛాన్సలర్ ని స్వామి వారి శేష వస్త్రంతో సత్కరించి, స్వామి వారి ప్రసాదాలను జ్ఞాపికగా స్వామి వారి ఫోటో ను అందజేశారు.

# మానవ హక్కుల మండలి జిల్లా సంఘటనా కార్యదర్శిగా నిద్దాన కామేశ్వరరావు నియామకం

**మాడుగుల , మే 08 ( మనం న్యూస్ ) :** మాడుగుల మండలం కేజేపురం గ్రామానికి చెందిన ప్రముఖ సామాజిక కార్యకర్త నిద్దాన కామేశ్వరరావుకు కీలక బాధ్యతలు వరించాయి. భారత మానవ హక్కుల మండలి అనకాపల్లి జిల్లా సంఘటనా కార్యదర్శిగా ఆయన నియమితులయ్యారు. ఈ మేరకు మండలి వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీకాంత్ చెన్నుపాటి శుక్రవారం నియామక పత్రాన్ని జారీ చేశారు. ప్రస్తుతం భారతీయ జనతా పార్టీలో చురుగ్గా ఉంటూ, జిల్లా యువ విభాగం ఉపాధ్యక్షులుగా బాధ్యతలు నిర్వహిస్తున్న కామేశ్వరరావు, సామాజిక న్యాయం మరియు పౌర హక్కుల పరిరక్షణ పట్ల చూపుతున్న అంకితభావాన్ని గుర్తించి ఈ నియామకం చేపట్టినట్లు మండలి పేర్కొంది. ఈ పదవిలో ఆయన రెండేళ్ల పాటు కొనసాగుతారని, పౌరులకు తమ ప్రాథమిక హక్కుల పట్ల అవగాహన కల్పించడంతో పాటు బాధితులకు అండగా ఉంటూ అధికారులతో సమన్వయం చేసుకుని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా అవగాహన సదస్సులు, సమావేశాల ద్వారా ప్రజలను చైతన్యపరచడమే లక్ష్యంగా పని చేయాలని నియామక పత్రంలో సూచించారు. భారత రాజ్యాంగం మరియు ఐక్యరాజ్య సమితి మార్గదర్శకాలకు అనుగుణంగా బాధ్యతలు నిర్వర్తిస్తానని ఈ సందర్భంగా కామేశ్వరరావు తెలిపారు. ఆయన నియామకం పట్ల మాడుగుల మండల ప్రముఖులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలియజేశారు.



## గాజువాకలో ఈ-బస్ స్టేషన్..50 ఎలక్ట్రిక్ బస్సులు కేటాయింపు

**గాజువాక / మల్కాపురం , మే 08 ( మనం న్యూస్ ) :** గాజువాక ఆర్టీసీ డిపోను ఆనుకుని ఉన్న నాలుగున్నర ఎకరాల్లో ఈ-బస్‌స్టేషన్ నిర్మాణానికి సన్నాహాలు మొదలయ్యాయి. విశాఖ రీజియన్‌కు కేటాయించిన వంద ఎలక్ట్రిక్ బస్సుల్లో గాజువాక డిపోకు 50 కేటాయించినట్టు రీజనల్ అధికారులు చెబుతున్నారు. ఆగస్టు నెల మొదటివారంలో ఈ-బస్సులు వచ్చే అవకాశం ఉందని ఆర్టీసీ ప్రధాన కార్యాలయం నుంచి సమాచారం అందడంతో గాజువాకలో ఈ-బస్‌స్టేషన్ ఏర్పాటు పనులు వేగవంతం చేశారు. ఎలక్ట్రిక్ బస్ డిపో కోసం కేటాయించిన స్థలాన్ని చదును చేసే పనులు చురుకుగా సాగుతున్నాయి. ఇక్కడ చార్జింగ్ స్టేషన్లు ఏర్పాటుచేయనున్నారు. కాగా, ప్రధాన రహదారి నుంచి ఈ-బస్సుల డిపోనకు గల మార్గాన్ని 30 మీటర్ల మేర వెడల్పు చేస్తున్నారు. ఈ క్రమంలో ఫుట్‌పాత్‌లను తొలగించారు. బస్సులు వచ్చే సమయానికి డిపోను సిద్ధం చేయాలని ఆర్టీసీ అధికారులు భావిస్తున్నారు.

## బీఎల్ఏలను నియమించుకోండి



**బొబ్బిలి , మే 08 ( మనం న్యూస్ ) :** ప్రతి పోలింగ్ కేంద్రానికి బూత్ లెవెల్ ఏజెంట్ (బీఎల్ఏ)ను రాజకీయ పార్టీలు తప్పనిసరిగా నియమించుకో వాలని ఆర్డీవో రామ్మోహనరావు కోరారు. భార త ఎన్నికల సం?ఘం, జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం బొబ్బిలి ఆర్డీవో కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించా రు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ని యోజకవర్గంలో 264 పోలింగ్ కేంద్రాలకు సం బంధించి పార్టీల వారిగా బీఎల్ఏల జాబితా ను రెండు రోజుల్లో సమర్పించాలని సూచించా రు. పోలింగ్ కేంద్రాలు శిథిలావస్థలో ఉంటే సమీపంలో నూతన భవనాల్లోకి మార్పుచేసే చర్యలు తీసుకుంటా మని తెలిపారు. కేంద్రాలపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే రాజకీయ పార్టీలు తెలి యజేయాలన్నారు. అనంతరం పోలింగ్ కేంద్రాల్లో బేసిక్ మినిమం ఫెసిలిటీ (బీఎం ఎఫ్) కల్పనపై సమీక్షించారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(సార్) ప్రీ రివిజన్ కార్యక్రమంలో భాగంగా 2002-2025 ఓటర్ జాబితాల మధ్య కామన్ ఓటర్ల ఆన్‌లైన్ మ్యాపింగ్‌ను బీఎల్వోల ద్వారా వందశాతం పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఓటర్ల జాబితాలో డబుల్ ఎంట్రీలు, బ్లర్ ఇమేజస్, డెమోగ్రాఫికల్ తప్పులు వంటి సమస్యలు ఫారం-8 ద్వారా సరిచేసుకునే అవకాశం ఉందన్నారు. అలాగే కొత్త ఓటర్ల చేర్పులు, మార్పులు, మరణించిన వారి ఓట్లు తొలగింపు ప్రక్రియ నిరంతరం కొనసాగుతుం దన్నారు. ఈ సమావేశంలో సీపీఎం నాయకు లు పి.శంకరరావు, ఎస్.గోపాలం, టీడీపీ నాయ కుడు వాసిరెడ్డి సత్యనారాయణ, బీజేపీ నాయ కుడు తాడ్డి ఈశ్వరరావు, కాంగ్రెస్ నాయకుడు శ్రీనివాసరావు హాజరయ్యారు.

## స.హ.చట్టంతో ప్రభుత్వ సేవల్లో నాణ్యత

**విజయనగరం , మే 08 ( మనం న్యూస్ ) :** ప్రభుత్వ కార్యాలయాల్లో పాదర్శకత, జవా బుదారీతనం, ప్రజా సేవల నాణ్యతను పెం పొందించడంలో ఆర్‌టీఐ చట్టం కీలక పాత్ర పోషిస్తుందని జిల్లా విద్యాశాఖ అధికారి యు.మాణిక్యంనాయుడు తెలిపారు. శుక్రవా రం పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో సమాచార హక్కు చట్టం(ఆర్‌టీఐ)పై జిల్లా ఉప విద్యాశా ఖ అధికారులు, మండల విద్యాశాఖ అధికార లతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి అధికారి ప్రజలకు సమయానుకూలంగా, సరైన సమాచారాన్ని అందించే విధంగా బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. విద్యా శాఖలో ప్రజా సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు అధికారులు కృషి చేయాల న్నారు. స్టేట్ రిసోర్స్‌పర్సన్ ప్రొఫెసర్ విష్ణుమూ ర్తి ఆర్‌టీఐ చట్టంలోని ముఖ్యాంశా లను వివ రించారు. సమాచార హక్కు చట్టం ప్రకారం పౌరులకు ఉన్న హక్కులు, ప్రభుత్వ కార్యాల యాల బాధ్యతలను వివరించారు. సమాచారా న్ని నిర్దిష్ట గడువులోగా అందించాల్సిన అవస రం ఉందని చెప్పారు అసిస్టెంట్ డైరెక్టర్ అరుణ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## బ్లడ్ బ్యాంకుల్లో నిండుకుంటున్న నిల్వలు

**విశాఖపట్నం , మే 08 ( మనం న్యూస్ ) :** బ్లడ్ బ్యాంకుల్లో నిల్వలు నిండుకుంటున్నాయి. కొద్దివారాల నుంచి రక్తం ఇచ్చేందుకు దాతలు ముందుకు రాకపోవడంతో ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయి. సాధారణంగా వేసవిలో రక్తదాతల సంఖ్య తగ్గుముఖం పడుతుంది. దాతల్లో దాదాపు 60 శాతానికిపైగా విద్యార్థులు ఉంటారు. కాలేజీల్లో, ఇతర సంస్థలు ఆధ్వర్యంలో నిర్వహించే శిబిరాల ద్వారా, వ్యక్తిగతంగా వచ్చి రక్తదానం చేస్తుంటారు. అలా సేకరించిన రక్తాన్ని బ్లడ్ బ్యాంకుల నిర్వాహకులు అవసరమైన రోగులకు అందిస్తుంటారు. అయితే చదువుల కోసం నగరంలో ఉండే విద్యార్థులంతా ఏప్రిల్, మే, జూన్ నెలల్లో విద్యా సంస్థలకు సెలవులు ఇవ్వడంతో సొంతూళ్లకు వెళుతుంటారు. వేసవి తీవ్రత వల్ల కలిగే ఇబ్బందులతో మరికొంతమంది విద్యార్థులు, ఇతరులు కూడా ఈ సమయంలో రక్తదానం చేసేందుకు ఆసక్తి చూపించరు. దీనివల్ల కొరత ఏర్పడుతోందని, గడిచిన రెండు, మూడు వారాలు నుంచి పరిస్థితి మరింత ఇబ్బందికరంగా ఉందని నిర్వాహకులు పేర్కొంటున్నారు. జిల్లాలో 20 వరకు బ్లడ్ బ్యాంకులు ఉన్నాయి. సాధారణ రోజుల్లో ఒక్కో బ్లడ్ బ్యాంకు నుంచి కనీసం 20 నుంచి 30 యూనిట్లు అందిస్తుంటారు. ఇలా ఇచ్చే యూనిట్లలో దాదాపు మూడొంతులు డోనర్స్ (రోగితో సంబంధం లేని) నుంచి సేకరించినవే ఉంటాయి. అయితే, ప్రస్తుతం బ్లడ్ బ్యాంకుల్లో నిల్వలు నిండుకోవడంతో పది యూనిట్లు కూడా ఇవ్వలేని పరిస్థితి వచ్చింది. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో రోగుల సహాయకుల్లో ఎవరైనా బ్లడ్ డొనేట్ చేయడానికి ముందుకురా



వాలని బ్లడ్ బ్యాంకు నిర్వాహకులు కోరుతున్నారు. అలా, ముందుకు వచ్చిన వారికి అవసరమైన బ్లడ్ ఏర్పాటు చేస్తున్నారు. మరో నాలుగైదు వారాల వరకు ఇదే పరిస్థితి ఉంటుందని చెబుతున్నారు. రోడ్డు ప్రమాద బాధితులకు, తలసీమియా బాధితులకు, ప్రసవాలు, ఇతర మేజర్ శస్త్ర చికిత్సలు నిర్వహించే సమయంలో రక్తం కావాల్సి ఉంటుంది. ఇవన్నీ, సాధారణ రోజుల్లో మాదిరిగా ఉండే అవసరాలే. అయితే, వేసవి సెలవుల్లో కొన్ని రకాల సర్జరీలను కొందరు ప్రణాళిక ప్రకారం చేయించుకుంటారు. సెలవులు, ఇతర కారణాలతో చేయించుకునే ప్లాన్డ్ సర్జరీల వల్ల కూడా మరో పది నుంచి 20 శాతం వరకు బ్లడ్ అవసరం పెరుగుతోందని, ఇది కూడా కొరతకు కారణమవుతున్నట్టు చెబుతున్నారు. కొద్దిరోజులు నుంచి బ్లడ్ బ్యాంకుల్లో నిల్వలు నిండుకోవడంతో ఇబ్బందిగా మారింది. విద్యార్థులు లేకపోవడం, వేసవి వల్ల రక్తదానం చేసేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో పరిస్థితి క్లిష్టంగా మారింది. ఈ నేపథ్యంలో రోగులకు ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నాం. రక్తదానం చేసేందుకు ఆసక్తి ఉన్న ఇతర వర్గాలను కలుస్తూ ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తున్నాం. అలాగే, అత్యవసర పరిస్థితుల్లో ఉన్న వారికి సామాజిక స్పృహ ఉన్న యువతను సంప్రతించి రక్తదానం చేసేలా వారిని ఒప్పిస్తున్నాం. వీలైనంత వరకు ఇబ్బందులు లేని ప్రతి ఒక్కరూ ఈ వేసవిలో రక్తదానం చేయడానికి ముందుకు రావాలి. దీనివల్ల ఎంతోమంది ప్రాణాలను నిలబెట్టేందుకు అవకాశం ఉంటుంది.

## 'మత్స్యకార సేవ'లో అనర్హులు

**భోగాపురం , మే 08 ( మనం న్యూస్ ) :** రొయ్యలు, చేపల సంతానోత్పత్తి కోసం ఏటా ప్రభుత్వం సముద్రంలో చేపల వేటపై నిషేధం విధిస్తుంటుంది. ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకు మెకనైజ్డ్, మోటరైజ్డ్ బోట్లను సముద్ర జలాల్లో చేపల వేటకు ఉపయోగించకూడదు. ఈ సమయంలో మత్స్యకారులను ఆదుకునేందుకు ప్రభుత్వం వేట నిషేధ భృతి కింద రూ.20వేలు ఇస్తుంది. వైసీపీ ప్రభుత్వంలో ఈ భృతి రూ.10వేలు ఉండేది. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత రెట్టింపు చేసింది. పరిహారం డబుల్ కావడంతో కొందరు బోటు యజమానులు అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. మత్స్యకార సేవా పథకానికి సంబంధించి భోగాపురం, పూసపాటిరేగ మండలాల్లో మత్స్యకార అధికారులు సర్వే చేపట్టారు. మత్స్యకార గ్రామాల్లో 939 పడవలకు సంబంధించి 4,320 మందిని ప్రాథమికంగా అర్హులుగా గుర్తించారు. వీరందరి వివరాలను ఆన్‌లైన్ చేయగా ఆరు దశల వెర్ఫికేషన్ అనంతరం అర్హులైన తుది జాబితా విడుదల కానుంది. వాస్తవానికి ఒక్కో బోటులో ఆరుగురు వరకు మత్స్యకారులు వేటకి



వెళ్లి వస్తుంటారు. వారి వివరాలు మాత్రమే అధికారులకు అందించాల్సి ఉంది. అయితే కొందరు బోటు యజమానులు ఇతర సామాజిక వర్గాలకు చెందిన వారి పేర్లను అందించినట్లు పలువురు మత్స్యకారులు ఆరోపిస్తున్నారు. ముక్కాం గ్రామానికి సంబంధించి సుమారు 70 మంది అనర్హుల పేర్లు లిస్టులో ఉన్నట్లు ఇటీవల మత్స్యశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. కలెక్టర్‌కి ఫిర్యాదు చేస్తామని మత్స్యకార నాయకులు రొయ్యడు, బడెనాయుడు తెలిపారు. దీనిపై మత్స్యశాఖ ఎఫ్‌డీవో శ్రీనివాసరావుని వివరణ కోరగా.. 'బోటు యజమాని ఎవరి ఆధార్ కార్డులు ఇస్తే వారి వివరాలను నమోదు చేశాం. మత్స్యకారులు కాకుండా వేరే కులస్తుల పేర్లు ఉంటే 6స్టెప్ వెరిఫికేషన్‌లో తొలగిపోతాయి. దీనిపై ముక్కాంకు చెందిన మత్స్యకారులు ఫిర్యాదు చేశారు.' అని తెలిపారు.

# అర్జీల పరిష్కారంలో సంతృప్తి స్థాయి 94 శాతం




**విజయనగరం , మే 08 ( మనం న్యూస్ ) :** ప్రజా సమస్యల పరిష్కారంలో జిల్లాకు సముచిత స్థానం దక్కింది. వాట్సాప్ గవర్నెన్స్ సేవలను అందించడంలో, వాట్సాప్ గవరెన్నీపై శిక్షణ ఇవ్వడంలో కూడా మంచి స్థానాలు పొందింది. అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధ్యక్షతన రెండో రోజు శుక్రవారం కూడా కలెక్టర్లు, ఎస్పీలతో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రగతికి సంబంధించిన పలు గణాంకాలను వెల్లడించారు. జిల్లాలో సమస్యల పరిష్కారంపై 94 శాతం ప్రజలు సంతృప్తి చెందారు. ప్రభుత్వ పథకాలకు సంబంధించి ప్రజల సంతృప్తిలో జిల్లా రెండో స్థానం దక్కించుకుంది. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ఏప్రిల్ నాటికి 58,289 మంది సేవలను వినియోగించుకున్నారు. దీంతో జిల్లాకు నాల్గో స్థానం వచ్చింది. వాట్సాప్ గవర్నెన్స్‌పై గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా 1,89,921 మందికి శిక్షణ అందించారు. దీంతో జిల్లాకు రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానం లభించింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాట్లాడుతూ.. జిల్లా అభివృద్ధిపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. సంతృప్తి స్థాయిలో పేదలందరికీ ఇళ్లు అందజేయాలని, అవసరమైన వారికి ఇళ్ల స్థలాలు, ప్రభుత్వ స్థలాల్లో గృహాలు నిర్మించుకున్నవారికి క్రమబద్ధీకరణ, 22 ఏ భూముల సమస్యలు పరిష్కారం వంటి అంశాలపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి పెట్టాలని సీఎం ఆదేశించారు. ఈ సదస్సుల్లో కలెక్టర్ రామసుందర్‌రెడ్డి, ఎస్పీ ఏఆర్ దామోదర్ పాల్గొన్నారు. ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందించడమే లక్ష్యంగా పాలనలో విప్లవాత్మక మార్పులు తీసుకురావాలని కలెక్టర్ రామసుందర్ రెడ్డి జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టర్ల సదస్సులో తీసుకున్న నిర్ణయాలను జిల్లాలో అమలు చేయడంపై ఆయన ప్రత్యేక దృష్టి సారించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఈ–ఆఫీస్ వ్యవస్థను పక్కాగా అమలు చేయాలని, ఏ ఒక్క ఫైల్ కూడా పెండింగ్‌లో ఉండకూడదని స్పష్టం చేశారు. సీఎం ఆదేశాల మేరకు 24 గంటల్లో ఫైళ్లు పరిష్కారం కావాలన్నారు. డిసెంబరు నాటికి అన్ని రకాలు ప్రభుత్వ సేవలు వాట్సాప్ ద్వారా ప్రజల ముంగిటకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విపత్తు నిర్వహణలో ఆవేర్ 2.0 అప్లికేషన్ ద్వారా వస్తున్న హెచ్చరికలను క్షేత్రస్థాయికి చేరవేసి ప్రాణ నష్టం జరగకుండా చూడాలన్నారు. ప్రతి సోమవారం పీజీఆర్ఎస్‌ను నిర్వహించడంతో పాటు ప్రతి శుక్రవారం నియోజకవర్గ స్థాయిలో ప్రజా ఫిర్యాదులను స్వీకరించి అక్కడికక్కడే పరిష్కరించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. సేవలందించడంలో వెనుకబడిన ప్రాంతాలను ఆర్టీజీస్ ఆధారిత స్మార్ట్ విజిట్ షెడ్యూలింగ్ ద్వారా గుర్తించి, తానే స్వయంగా క్షేత్ర స్థాయిలో పర్యటనలు చేస్తానని కలెక్టర్ అన్నారు.

# సంతృప్తి సగమే...

**అనకాపల్లి , మే 08 ( మనం న్యూస్ ) :** గత ఆర్థిక సంవత్సరంలో డిసెంబరు నుంచి ఫిబ్రవరి వరకు మూడు నెలలతో పోలిస్తే ఈ ఏడాది మార్చి, ఏప్రిల్ నెలలో జిల్లాలో కొన్ని ప్రభుత్వ శాఖల పనితీరు మెరుగైన ఫలితాలు సాధించగా, మరికొన్ని విభాగాల పనితీరు పేలవంగా వుంది. జిల్లాలో ఆర్టీసీ, హౌసింగ్, రవాణా సేవలపై ప్రజలు బాగా సంతృప్తి చెందగా, ఇసుక సరఫరా, గ్రామ పంచాయతీల్లో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ సేవలపై అసంతృప్తి వ్యక్తమైంది. సుమారు 40 శాఖలకు సంబంధించిన సేవలు, అభివృద్ధి పనులపై గత మూడు నెలలతో పోలిస్తే.. ఈ రెండు నెలల్లో ప్రజల సంతృప్తి 3.3 శాతం పెరిగింది. ప్రభుత్వ పథకాలు కేవలం గణాంకాలకే పరిమితం కాకుండా ప్రజలకు నిజంగానే చేరుతున్నాయా? పథకాల అమలు తీరుపై ప్రజల్లో సంతృప్తి పెరుగుతున్నదా? వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా ప్రజలకు అందుతున్న సేవలు ఎలా వున్నాయి? అభివృద్ధి పనుల తీరుపై ప్రజలు ఏమనుకుంటున్నారు? తదితర అనే అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజల స్పందన, క్షేత్రస్థాయి ఫలితాలను అంచనా వేస్తూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధ్యక్షతన రాష్ట్ర సచివాలయంలోనిర్వహిస్తున్న రెండు రోజుల కలెక్టర్ల సదస్సులో జిల్లాల పనితీరుపై విస్తృత సమీక్ష జరిగింది. రెండో రోజైన శుక్రవారం అనకాపల్లి జిల్లాలో పథకాల అమలు తీరు, ప్రజా సంతృప్తిపై కలెక్టర్ విజయకృష్ణన్‌కు చంద్రబాబునాయుడు దిశా నిర్దేశం చేశారు. జిల్లాలో కొన్ని ప్రభుత్వ శాఖలు మెరుగైన ఫలితాలు సాధించగా, మరికొన్నింటి పనితీరు అత్యంత పేలవంగా వుంది. జిల్లాలో ఆర్టీసీ, హౌసింగ్, రవాణా సేవలపై ప్రజల సంతప్తి శాతం ఆశాజనంగా వుండగా, ఇసుక సరఫరా, గ్రామ పంచాయతీలో చెత్త నిర్వహణపై తీవ్ర అసంతృప్తి వ్యక్తమైంది. ఆర్టీసీ బస్సు సేవలకు ప్రజాభిమానం భారీగా పెరిగింది. గత త్రైమాసికంలో ఆర్టీసీ సేవలు 42.8 శాతం ఉండగా ఇప్పుడు సంతృప్తిస్థాయి ఏకంగా 80.4 శాతానికి చేరి, 37.6 శాతం పెరుగుదల నమోదైంది. హౌసింగ్ సేవవలకు సంబంధించి ప్రజల సంతృప్తి 62.1 శాతం నుంచి 75.4 శాతానికి పెరిగింది. ధాన్యం కొనుగోళ్లలో 9.9 శాతం మెరుగుదల కనిపించింది. రహదారులపై గుంతల పూడ్చివేత, రిజిస్ట్రేషన్లు, బీసీ వసతిగృహాలు, అన్ని రకాల ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య సేవలు, రేషన్ పంపిణీ, రీసర్వే, ఎన్టీఆర్ భరోసా, అన్న క్యాంటీన్ల నిర్వహణ, స్వర్ణ గ్రామ/ వార్డుల సేవలు, మధ్యాహ్న భోజనం పథకం అమలులో గత త్రైమాసికం కంటే సంతృప్తి శాతం బాగానే మెరుగుపడింది. ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ 91.3 శాతం సంతృప్తితో అనకాపల్లి జిల్లా రాష్ట్రస్థాయిలో మొదటి స్థానంలో వుంది. వాట్సాప్ గవర్నెన్స్, ఫిర్యాదుల స్వీకరణ, సేవల రంగంలో జిల్లా అగ్రస్థానంలో ఉంది.

**ఇసుక, పారిశధ్యంపై అసంతృప్తి**



జిల్లాలో ఉచిత ఇసుక సరఫరా పథకంపై ప్రజల నుంచి తీవ్ర అసంతృప్తి వ్యక్తమైంది. గత త్రైమాసికంలో 45 శాతం ఉన్న సంతృప్తి ఈసారి 17.5 శాతంతో (27.5 శాతం తగ్గుదల) అట్టడుగున వుంది. గ్రామ పంచాయతీల్లో పారిశుధ్య సేవలు 61 శాతం నుంచి 56.7 శాతానికి పడిపోగా, దీపం–2 పథకం 3.7 శాతం తగ్గింది. మహిళలపై నేరాల నియంత్రణ, విద్యా సేవలు, వీధి దీపాలు, ఆర్టీసీ బస్టేషన్ల నిర్వహణ, తాగునీటి సరఫరా, విద్య, సాంఘిక సంక్షేమ వసతిగృహాలు, అగ్నిమాపక శాఖ నుంచి ఎన్‌వోసీల జారీ, విద్యుత్తు, తదితర అంశాల్లో ప్రజల అసంతృప్తి ఒకింత పెరిగింది. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ, ప్రజలకు నేరుగా అందాల్సిన సవల విషయంలో నిర్లక్ష్యాన్ని సహించబోమని స్పష్టం చేశారు. ముఖ్యంగా ఇసుక, గ్రామాల్లో పారిశుధ్యం, విద్య మహిళా భద్రత అంశాల్లో వెంటనే ఫలితాలు కనిపించాలని ఆదేశించారు. జిల్లాలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) పనితీరుపై ప్రజలు అసంతృప్తితో ఉన్నారని వెల్లడైంది. గత మూడు నెలల గణాంకాల ప్రకారం జిల్లాలో వ్యక్తిగత, సామాజిక ఫిర్యాదుల సంఖ్య భారీగా ఉండగా, పరిష్కార ప్రక్రియ మాత్రం ఆశించిన స్థాయిలో లేదు. ఈ కాలంలో మొత్తం 6,577 వ్యక్తిగత ఫిర్యాదులు నమోదుకాగా వీటిలో 3,076 ఫిర్యాదులను మాత్రమే పరిష్కరించారు. ఇంకా 3,501 ఫిర్యాదులు పెండింగ్‌లో ఉన్నాయి. ఏప్రిల్ 2వ తేదీ నుంచి మే ఒకటో తేదీ వరకు పరిస్థితి మరింత దిగజారింది. ఈ కాలంలో మొత్తం 2,175 ఫిర్యాదులు అందగా, 504 మాత్రమే పరిష్కరించగలిగారు. 1,671 ఫిర్యాదులు పెండింగ్‌లో వున్నాయి. సామాజిక సమస్యలపై గత మూడు నెలల్లో 2,747 ఫిర్యాదులు అందగా వాటిలో 1,409 మాత్రమే పరిష్కరించారు. 1,338 ఫిర్యాదులు పెండింగ్‌లో ఉన్నాయి. ఏప్రిల్‌లో 1,041 ఫిర్యాదులు అందగా కేవలం 326 మాత్రమే పరిష్కరించారు. 715 ఫిర్యాదులు పెండింగ్‌లో వున్నాయి.

# గిరిజన సమస్యల పరిష్కారానికి కృషి : ఐటీడీఏ పీవో పవార్ స్వప్నిల్



**హరిపురం , మే 08 ( మనం న్యూస్ ) :** గిరిజనుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఐటీడీఏ పీవో పవార్ స్వప్నిల్ అన్నారు. మందసలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో శుక్రవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో గిరిజన సమస్యలపై వినతులు స్వీకరించారు. ఒడిశా అధికారుల నుంచి సరిహద్దు గ్రామాలైన మాణిక్యపురం తదితర గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను విన్నవించారు. కొసమాలలో వ్యాటర్ ట్యాంకు నిర్మించాలని, రోడ్డు పనులు వేగవంతం చేయాలని కోరారు. విద్యుత్ సమస్య పరిష్కరించాలని నువాగడ గ్రామస్థులు, రోడ్డు మరమ్మత్తులు చేయాలని పట్టులోగాం గ్రామస్థులు విజ్ఞప్తి చేశారు. కుడుమసాయిలో పాఠశాల ఏర్పాటు చేయాలని, ఒడిషా ఆంధ్రా కనక్టెవిటీ రోడ్డు వేయాలని, వ్యవసాయ బోర్లు, బావులకు త్రీ ఫేజ్ విద్యుత్తు సరఫరా చేయాలని, వంతెన మంజూరు చేయాలని పలువురు వినతిపత్రాలను అందజేశారు. వీటితోపాటు రోడ్లు, సామాజిక భవనాలు, మంచినీటి బోర్లు, బావులు, విద్యుత్ వంటి పలు సమస్యలపై మొత్తం 23 వినతిపత్రాలను అందించారు. వీటన్నింటినీ పరిశీలించి ప్రాధాన్యతా పరంగా పరిష్కారానికి కృషి చేయనున్నట్లు పీవో తెలిపారు. ప్రతీ నెల గ్రీవెన్స్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. వైద్య సిబ్బంది పనివేళలు పాటించి, పూర్తిస్థాయిలో సేవలు అందించాలని పీవో పవార్ స్వప్నిల్ ఆదేశించారు. మందస పీహెచ్‌సీని ఆయన పరిశీలించారు. ఆసుపత్రిలోని రోగులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, గ్రామాల్లో ప్రజలకు మరిన్ని సేవలందిలా కృషి చేయాలని వైద్యసిబ్బందికి సూచించారు. అనంతరం కిల్లోయికాలనీలో వీడీవీకే కేంద్రాన్ని పరిశీలించారు. ఉత్పత్తి చేస్తున్న వివిధ రకాల వస్తువులను పరిశీలించి పూర్తిస్థాయిలో మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పీవోతోపాటు పలాస ఆర్డీవో అప్పలరాజు, తహసీల్దార్ మిస్కా శ్రీకాంత్, ఎంపీడీవో వెంకటరమణ, హౌసింగ్ ఏఈ నరసింగరావు, జీసీడీవో రాములమ్మ, వెలుగు డీపీఎం రమణ పాల్గొన్నారు.